నమ్మలేని నిజాలు

నేతాజీ జైహింద్
ఏకతా సూత్ర నినాద్
సురక్షా భారత్.

ఓటుకు నోటు
ఓటుకు నాటుసారా
ఓటు వ్యాపారం.

వాణీ పంచమి
విద్యాభ్యాస దినామి
విజ్ఞాన తిథి.

మేడారం తీర్థం
కుంభమేళా వైభవం
జనజాతర.

స్వప్న లాహిరి
భగ్నప్రేమ విహారి
మధు దాహార్తి.

- రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

శ్రీ నిజాలు

మనపంట ఎగుమతులు బంద్
ఇరాన్‌ఇజ్రాయెల్ యుద్ధం !
అర్నెల్లుఅంటుందిరాన్
యుద్ధానికి మేం సిద్ధం !
గ్యాసు సిలిండర్ కోసం
నాలుగు దిక్కులకు మొక్కు !
మొక్కిన వరమియ్యకుంటె
కట్టెలపోయ్యినే దిక్కు !

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ గురువారం 12-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:170 పేజీలు:6 వెల: రూ.1/-


## హైదరాబాద్ జర్నలిస్టులిస్టు కాలనీలో
# ఎం. ఎస్. ఆచార్య విగ్రహావిష్కరణ

హైదరాబాద్, మార్చి 11: హైదరాబాద్‌లోని గోపనపల్లి జర్నలిస్ట్ కాలనీలో స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్ జర్నలిస్ట్ ఎం.ఎస్. ఆచార్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ విలువలతో కూడిన జర్నలిజాన్ని నడిపిన వ్యక్తి ఎం.ఎస్. ఆచార్య, నాటి జర్నలిజానికి నేటి జర్నలిజానికి ఎంతో తేడా ఉందని మంత్రులు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ హాయాం విలువలతో కూడిన జర్నలిజాన్ని ముందుకు తీసుకువెళ్లే బాధ్యత నేటి తరం పై ఉందన్నారు. జనధర్మ పత్రిక మళ్లీ రావడం చాలా సంతోషకరమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలో నాటి తరం నుంచి నేటి తరం వరకూ అందరికీ స్ఫూర్తిని అందించిన వ్యక్తి ఎం.ఎస్.ఆచార్య అని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో చిన్న పత్రికలు



విగ్రహావిష్కరణలో పొన్నం రవిచంద్ర, కె.రామచంద్రమూర్తి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, శిల్పి ఉదయ్, రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు, బైస దేవదాసు, కె. శ్రీనివాసరెడ్డి, గోపరాజు భ్రహ్మాండభేరి, హర్ష, శ్రీమతి వేద కళ్యాణి తదితరులు.

లోనే జర్నలిస్టులకు అన్ని విషయాలలో న్యాయం, సదుపాయాలు అందాయని మంత్రులు చెప్పారు.మీడియాలోకి కార్పోరేట్ రంగం అడుగు పెట్టడం ప్రమాదకరమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. విలువలతో కూడిన జర్నలిజం చేయండని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ప్రముఖ తెలంగాణ పోరాటయోదుడు, సీనియర్ జర్నలిస్ట్ ఎం.ఎస్. ఆచార్య విగ్రహాన్ని శనివారం నాడు హైదరాబాద్ గోపనపల్లిలోని జర్నలిస్ట్ కాలనీలో మం త్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభా కర్ ఆవిష్కరించారు. ఎం.ఎస్.ఆచార్య కుమారుడు మాడభూషి శ్రీధర్ రూపొందించిన ఎంతో ప్రముఖ పాత్రను పోషించాయనీ అందులో జనధర్మ, వరంగల్ వాణి చాలా కీలక పాత్ర పోషించా యన్నారు.

కాంగ్రెస్ పార్టీ అందరి పార్టీ అనీ జర్నలిస్టులకు న్యాయం చేస్తుం దన్నారు. మేం ప్రజాస్వామ్యాన్ని విశ్వసించాము. అందుకే మేం ఇంతవరకూ పేపర్, ఛానల్ పెట్టలేదన్నారు. జర్నలిస్టులు విమర్శలు చేయవచ్చు. కానీ విలువలతో కూడా విమర్శలు చేస్తే ఎవరికి ఇబ్బంది ఉండదనీ, ప్రముఖు లను మార్గదర్శకంగా తీసుకొని నేటి తరం మీడియా ముందుకు వెళ్లాలని పొన్నం ప్రభాకర్ కోరారు.

మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీని





'జనధర్మ' ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో గోపరాజు భ్రహ్మాండభేరి, మామిడి హరికృష్ణ, కె.రామచంద్రమూర్తి, మాడభూషి శ్రీధర్, శ్రీమతి వేద కళ్యాణి, రాష్ట్ర మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కె. శ్రీనివాసరెడ్డి తదితరులు.

ఈ విగ్రహాన్ని శిల్పి ఉపేంద్ర తయారు చేశారు. ఎం.ఎస్. ఆచార్య పేపర్ బాయ్ నుంచి ఎడిటర్‌గా ఎదిగి జనధర్మ, వరంగల్ వాణి వంటి పత్రికలను నడిపి ఎన్నో అంశాలను వెలుగులోకి తీసుకొచ్చారనీ ఆయన లాంటి జర్నలిస్టులు నేటి తరం వారికి ఎంతో స్ఫూర్తి అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. నిజాంకు వ్యతిరే కంగా పోరాడిన యోధుడు, పదిమందికి విషయాలు తెలియాలని తపించేవారన్నారు. ఎం. ఎస్.ఆచార్య వివిధ పత్రికల్లో పని చేసి, అక్షరాన్ని నమ్ముకున్న వ్యక్తిగా, చరిత్రలో నిలబడే వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. ఇక వారి కుమారుడు మాడభూషి శ్రీధర్ కూడా వారి తండ్రి బాటలో విలువలను ముందుకు తీసుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. ఎం.ఎస్.ఆచార్య గారి విగ్రహ ఆవిష్కరణకు రావడం మాకు గొప్ప అవకాశమని మంత్రులు చెప్పారు. అక్షరం అమ్ముడు పోయే వస్తువు కాదు.. సామాజిక చైతన్యం రావాలని, కొత్త తరం జర్నలిస్టు సోదరులు ఇంకా అనేక అంశాలు నేర్చుకోవాలనీ, మారు తున్న ప్రపంచానికి అనుగుణంగా జర్నలిస్టులు ఎదగాలని ఆయన అభిప్రాయపడ్డారు. కార్పోరేట్ రంగం మీడియాలో అడుగుపెట్టడం శుభపరిణామం కాదనీ, అందర్నీ డిక్టేట్ చేయడం, జర్నలిజాన్ని డిక్టేట్ చేయడం సరికాదని అన్నారు. జర్నలి జం ఫీల్డ్‌లో కూడా రెడీమేడ్ కాకూడదనీ, గతంలో ఒక జర్నలిస్ట్ క్యారెక్టర్ చూస్తే ఒక ఇనిస్ట్యూట్‌లా ఉండేదనీ నేడు ఆ పరిస్థితి లేకపోవడం శోచనీయమనీ, వాస్ రెడ్డి మాట్లాడుతూ ఎం.ఎస్. ఆచార్య గారు కేవలం వరంగల్ కే పరిమి తం అయ్యారు, వారు హైదరాబాద్‌లో ఉండి ఉంటే ఎక్కడో ఉండేవారన్నారు. వరం గల్ లో జర్నలిస్ట్ అంటే ఎం ఎస్ ఆచార్యగారే. ఆయన వద్ద చాలా మంది పనిచేశారు. వారి నుంచి ఎంతోమంది జర్నలిస్టులు ఎంతో నేర్చుకున్నారని అన్నారు. ఈ సొసైటీకి కూడా స్థలాలు వచ్చే విధంగా మంత్రులు కూడా బాధ్యత తీసుకోవాలని కోరారు. సొసైటీ అధ్యక్ష్యుడు బ్రహ్మాండభేరి గోపరాజు మాట్లాడుతూ... మంత్రులకు హౌసింగ్ సొసైటీ యొక్క పరిస్థితిని వివరించారు. కాంగ్రెస్ పార్టీ హాయాంలోనే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చారనీ, వారి వల్లనే మూడు కాలనీ ఏర్పాడ్డాయని గుర్తు చేశారు. త్వరలోనే ఈ సొసైటీలోని నాన్ అలాటీస్‌కు న్యాయం చేసే విధంగా మంత్రులు ప్రయత్నించాలని కోరారు. నాన్న చూపిన బాటలోనే నడిచా నని, ఆయన వల్లనే నేను ఇంతటివాడిని అయ్యానని, వారి విగ్రహం ఇక్కడ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని మాడభూషి శ్రీధర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరిక్రిష్ణ, సీనియర్ జర్నలిస్టులు కె. రామచంద్ర మూర్తి, బైస దేవదాసు, పాశం యాదగిరి, ధరూరి వెంకటాచారితో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు, కాలనీ వాసులు, ఎం.ఎస్. ఆచార్య కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

# భారత్‌కు వస్తున్న థాయ్‌లాండ్ కార్గో షిప్‌పై క్షిపణి దాడి.. 22 మందిని కాపాడిన నేవీ





టెహ్రాన్, మార్చి 11: మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి గుండా వెళ్తున్న థాయ్‌లాండ్ కార్గో షిప్‌పై క్షిపణి దాడి జరిగింది. ఒమన్ తీర ప్రాంతం సమీపంలో కార్గో షిప్ మయూరీ నారీ ని ఇరాన్ ప్రాజెక్టైల్ ఢీకొన్నట్టు థాయ్ అధికారులు తెలిపారు. థాయ్‌లాండ్ నేవీ, అంతర్జాతీయ తీరప్రాంత అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ప్రొజక్టైల్ దాడితో నౌకలో మంటలు చెలరేగి సగభాగం కాలిపోయిందని, 20 మంది సిబ్బందిని రెస్క్యూ టీమ్ కాపాడగా, మరో ముగ్గురు ఓడలోనే చిక్కుకుపోయారని తెలుస్తోంది.

ప్రాథమిక సమాచారం ప్రకారం, మయూరీ నారీ ఇంధన నౌక గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు వస్తుండగా ఈదాడి జరిగింది. మరో రెండు నౌకలు కూడా భద్రతా కారణాలతో హోర్ముజ్ జలసంధిలో చిక్కుకుపోయినట్టు తెలుస్తోంది.

ఆయిల్ టాంకర్ల కదలికలను అడ్డుకునేందుకు హోర్ముజ్ జలసంధిని ఇరాన్ బ్లాక్ చేసింది. దీంతో క్రూడాయిల్, గ్యాస్ రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రపంచ దేశాలపై ఇప్పటికే ఈ ప్రభావం కనిపిస్తున్నట్టు ఆందోళనలు వ్యక్తమవుతుండగా, తాజాగా థాయ్‌లాండ్ కార్గో షిప్‌పై దాడి మరింత ఆందోళనకు తావిస్తోంది. ఈ దాడి ఎవరు చేశారనేది ఇంకా నిర్ధారణ కానప్పటికీ, హౌతీ తిరుగుబాటుదారుల పని కావచ్చని వినిపిస్తోంది.

# ఎల్పీజీ సిలిండర్ల కొరత.. రోజుకు రెండు పూటలే భోజనం.. బెంగళూరు హాస్టళ్ల నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి 11:ఎల్పీజీ సిలిండర్ల కొరత దేశంలోని మెట్రో నగరాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. వాణిజ్య సిలిండర్లకు కొరత ఏర్పడటంతో కర్ణాటక రాజధాని బెంగళూరులో రెస్టారెంట్లు, హోటల్ ఇండస్ట్రీ ఇబ్బంది పడుతోంది. ఈ ప్రభావం ఇప్పుడు పీజీ (పెయింగ్ గెస్ట్) అకామడేషన్స్‌పై కూడా పడింది. దీంతో బెంగళూరు పీజీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గెస్ట్‌లకు అందించే ఆహార పదార్థాల (మెనూ) విషయంలో మార్పులు చేశాయి. ఇకపై వీక్ డేస్‌లో రోజుకు రెండు మీల్స్ మాత్రమే అందిస్తామని ప్రకటించింది.

వీకెండ్స్‌లో మాత్రం మూడు మీల్స్ అందిస్తామని అసోసియేషన్ తెలిపింది. తాత్కాలికంగా ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్న ట్లు తెలిపింది. సోమవారం నుంచి శుక్రవారం వరకు రెండు మీల్స్ మాత్రమే అందిస్తారు. అంటే ఈ ఐదు రోజులు బ్రేక్‌ఫాస్ట్ ఉండదు. అలాగే, శని, ఆదివారా ల్లో మాత్రం బ్రేక్‌ఫాస్ట్‌తో కలిపి మూడు సార్లు భోజనం అందిస్తా రు. అ లాగే అత్యధికంగా గ్యాస్ వినియో గించి తయారు చేసే దోశ, చపాతి, పూరి వంటివి అందించరు. వీటి బదులు తక్కు వ గ్యాస్ అవసరమయ్యే బిసిబెలె బాత్, చిత్రాన్నం, పులిహోర వంటి రైస్ ఐటమ్స్ అంది స్తారు. అలాగే తక్కువ గ్యాస్ అవ సరమయ్యే లేదా అసలు గ్యాస్ అవసరమే లేని సలాడ్స్ వంటివి అందించాలని కూడా పీజీ అసోసి యేషన్ నిర్ణయించింది. అలాగే ఎల్పీజీ గ్యాస్ వినియోగం తగ్గించి, ఇండక్షన్ స్టవ్‌లవైపు కొన్ని పీజీలు మొగ్గు చూపుతున్నాయి. బెంగళూరులో లక్షల మంది పీజీ (హాస్టళ్లు)లలో ఉంటున్నారు. వీరందరికీ ఆహారం అందించా లంటే భారీ సంఖ్యలో ఎల్పీజీ కమర్షియల్ సిలిండర్లు అవసరం. ప్రస్తుతం గల్ఫ్ సంక్షోభం కారణంగా తగినంత సరఫరా లేకపోవడంతో పీజీలు ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నాయని పీజీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బెంగళూరు అధ్యక్షుడు అరుణ్ కుమార్ అన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల వల్ల కొన్ని మా ర్పులతో పీజీలు నడిపిస్తు న్నా మ ని, కానీ, 10-15 రోజుల్లో పరి స్థితుల్లో మార్పులు రాకపోతే ఇంకా ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆయన అన్నారు.

## స్పీకర్ ఓంబిర్లాపై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

న్యూఢిల్లీ, మార్చి 11:లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా పై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో బుధవారంనాడు వీగిపోయింది. విపక్ష ఎంపీల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ ఎంపీ మహమ్మద్ జావేద్ ఈ తీర్మానాన్ని తొలి దఫా పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టగా, రెండో దఫా బడ్జెట్ సమావేశాల్లో దీనిపై చర్చను ప్యానల్ స్పీకర్ జగదంబిక పాల్ చేపట్టారు. రాహుల్ గాంధీ, అమిత్‌షా, రవిశంకర్ ప్రసాద్ తదితరులు చర్చలో పాల్గొన్నారు. అనంతరం ఓటింగ్ చేపట్టగా... మూజువాణి ఓటుతో ప్రతిపక్షాల తీర్మానం వీగిపోయింది.

## స్పీకర్‌పై అవిశ్వాసం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు: కేంద్ర హోంమంత్రి

ఇంటర్నెట్ మార్చి 11: పార్లమెంట్ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

దాదాపు 40 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒక స్పీకర్ పై ఇలాంటి తీర్మానం రావడం దురదృష్టకరమని, ఇది పార్లమెంటరీ సంప్రదాయాలను కించపరచ డమే అని ఆయన పేర్కొన్నారు. స్పీకర్ స్థానాన్ని రాజకీయ కోణంలో చూడటం తగదని అమిత్ షా స్పష్టం చేశారు.

హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. 'స్పీకర్ పదవికి రాజకీయాలతో సంబంధం లేదు. సభలో ఆయన అందరివాడు, అన్ని పార్టీల ఏకాభిప్రాయంతోనే స్పీకర్ ఎంపిక జరిగింది. అటువంటి వ్యక్తి నిబద్ధతను, నిష్పక్షపాత వైఖరిని ప్రశ్నించాల్సిన అవసరం లేదు' అని ఆయన వ్యాఖ్యానించారు.

సభా నిబంధనలను కాంగ్రెస్ పార్టీ పదే పదే ఉల్లంఘిస్తోందని అమిత్ షా ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తు చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం సభలో అమలవుతోన్న నిబంధనలు నెహ్రూ కాలంలో రూపొందబడ్డాయి, వాటిని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. సభా మర్యాదలను కాపాడటంతో ప్రతిపక్షాలు విఫలమవుతున్నాయి, నిబంధనలను పాటించకుండా స్పీకర్ పై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు' అని అన్నారు.

## రాజధాని అమరావతిలో భారీ అగ్నిప్రమాదం.. విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

అమరావతి, మార్చి 11: రాజధాని అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డులో చోటు చేసుకున్న భారీ అగ్ని ప్రమాద ఘటనపై ఏపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ అగ్ని ప్రమాదం.. ప్రమాదవశాత్తు జరిగిందా.. లేక కుట్ర ఏమైనా ఉందా.. అనే కోణంలో విచారణ జరపాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కాగా సమీప పోలంలో నుంచి మంటలు వచ్చాయని ఎల్ అండ్ టీ ప్రతినిధులు వెల్లడించారు. పోలం నుంచి పైపుల వరకు గడ్డి పేర్చి.. పైపులకు నిప్పు పెట్టినట్లు అనవాళ్లు ఉన్నాయని అంటున్నారు. ఈ ప్రమాద ఘటన స్థలానికి ఫోరెన్సిక్ బృందం ఇప్పటికే చేరుకుంది.

మరో వైపు పోలాల వైపు నుంచి మంటలు అంటుకుంటూ వచ్చాయని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. అయితే ఈ ప్రమాదంపై పలు సందేహాలను స్థానికులు వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం ఈ ఘటనపై విచారణకు ఆదేశించింది. ఏడు అగ్నిమాపక వాహనాలు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాయి. మంటలు అదుపులోకి వచ్చాయని ఫైర్ డీజీ వెంకట రమణ వెల్లడించారు. అగ్నికి ఆహుతి అయిన పైప్ లైన్లు అన్ని ఏడు రకాల ఎమినిటీస్ కల్పించేందుకు ఉంచినవని అధికారులు వెల్లడించారు. ఇవన్నీ పీవీసీ పైపులని.. చాలా ఖరీదైనవని అధికారులు వివరించారు.

## ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్.. తెలంగాణకు మచ్చ: బీజేపీ ఎంపీ

న్యూఢిల్లీ, మార్చి 11: పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని బీజేపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ అభివర్ణించారు. ఇది చీకటి రోజు అని పేర్కొన్నారు. బుధవారం పార్టీ ఫిరాయింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు దానం, కడియం శ్రీహరిల పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్ బుధవారం విచారించారు అనంతరం ఆ పిటిషన్లను ఆయన కొట్టేశారు. ఈ వ్యవహారంపై బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ న్యూఢిల్లీలో స్పందించారు.

ఈ వ్యవహారం సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ మారిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు సైతం ఇచ్చారని గుర్తు చేశారు. పార్టీ ఫిరాయింపులకు నిర్వచనం ఏమిటంటూ సందేహం వ్యక్తం చేశారు.

## యువరాజుకి ఏమీ తెలీదు: ప్రధాని మోదీ

తిరువనంతపురం, మార్చి11: ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు సంధించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. దేశ యువతపై ఆయనకు అవగాహన లేదంటూ రాహుల్ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ యువరాజుకి ఏమీ తెలీదంటూ ఆయనపై పరోక్ష విమర్శలు చేశారు. దేశ అభివృద్ధిని కాంగ్రెస్ యువరాజు చూడలేక పోతున్నారంటూ రాహుల్ తీరుపై మండిపడ్డారు.

బుధవారం కేరళలోని ఎర్నాకులంలో ప్రధాని మోదీ పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. యుద్ధం పేరుతో తనను కాంగ్రెస్ పార్టీ దూషిస్తోందని తెలిపారు. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై కాంగ్రెస్, వామపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. గల్ఫ్‌లో భారతీయులు చిక్కుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటుందన్నారు. ఆయా దేశాల్లోని భారతీయులను కాపాడేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

ఇక ఈ పర్యటనలో పలు ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు చేశారు. అలాగే వివిధ పథకాలను ఆయన ప్రారంభించారు. ఈ పర్యటన అనంతరం తమిళనాడులో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్రంలో పలు అభివృద్ధి పథకాలకు ఆయన శంకుస్థాపన చేయనుండడంతోపాటు వివిధ పథకాలను ప్రారంభించనున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

మరికొద్ది రోజుల్లో తమిళనాడు, కేరళలతోపాటు అసోం, మేఘాలయా, పుదుచ్చేరి అసెంబ్లీలకు మార్చి నుంచి మే మాసాల మధ్య ఎన్నికల నగారా మోగనుంది. దీంతో ఆయా రాష్ట్రాల్లో అధికారం అందుకోవాలని బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు వామపక్ష పార్టీలైన కమ్యూనిస్టు పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఆ క్రమంలో ప్రధాని మోదీ బుధవారం కేరళ, తమిళనాడుల్లో పర్యటిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

# ఫిరాయింపులపై కేటీఆర్ మాట్లాడటం విడ్డూరం: మంత్రి సీతక్క

హైదరాబాద్, మార్చి 11: బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పుపై మంత్రి సీతక్క స్పందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫిరాయింపులపై మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కేటీఆర్.. ముందు క్షమాపణలు చెప్పి మాట్లాడాలని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను తీసుకున్నారని.. మండలి చైర్మన్ పదవి లాగేసుకున్నారని గుర్తుచేశారు.

తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డిలకు నేరుగా మంత్రి పదవులు ఇచ్చిన విషయాన్ని కేటీఆర్ మర్చిపోయారా అని ప్రశ్నించారు. కేటీఆర్ నీతి మంతుడైనట్టు మాట్లాడుతున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. స్పీకర్ తన పరిధి మేరకే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. 'బీఆర్ఎస్ తీసుకుంటే అభివృద్ధి కోసం.. కాంగ్రెస్ తీసుకుంటే ప్రజాస్వామ్యంపై దాడా' అంటూ మంత్రి మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలకు సిగ్గుండాలని అంటూ మంత్రి సీతక్క తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందే బీఆర్ఎస్: టీపీసీసీ చీఫ్

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందే బీఆర్ఎస్ అని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఫిరాయింపుల గురించి కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. స్పీకర్ తన అధికార పరిధిలోనే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కేటీఆర్, హరీష్ రావు ఏం మాట్లాడినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రాజ్యాంగాన్ని ఖూనీ చేసిందే బీజేపీ అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేస్తుందనే ప్రజలు ఆశీర్వదిస్తున్నారని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.




నేటి నిజం
# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 12-3-2026

## సప్త పదులు

సతాయింపు
బుజ్జగింపు

పార్టీలను
మార్చేనాయకులకు
మూల్యాలతోచేస్తారు
ముక్తాయింపు.

-డా. గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

నయం
అభినయం

వ్యక్తి
గుణాలన్నింటిలోనూ
శోభను కలిగించేది
వినయం.

-కె.ఎం.కె.మూర్తి
9441802694

కలలు
వలలు

అర్ధంలేని
డిజిటల్‌ప్రేమలో
అమ్ముడుపోతున్న
అబలలు..

-పద్మావతి పి.
హైదరాబాద్

## సప్త పదులు

పోరకు
కూరకు

ఏరుదాటాక
తెప్పతగలెయ్యకు మరలా
అవసరంరావచ్చు
నోరుజారకు.

-శ్రీపెరంబుదూరు నారాయణ రావు'శ్రీనారా'
హైదరాబాద్.

చెమ్మ
రెమ్మ

పదారణ్యంలో
అత్యంత
మధురమైన పదం.
అమ్మ.

-కాకర్ల చెంచలరావు
ఒంగోలు.

జ్ఞానము
తీర్మానము

కళ చైతన్యం
సంస్కృతి
వైభవానికి
నిదర్శనము

- శ్రీవాణి
9392393623





# అంతరంగ తరంగాలు

చారిత్రక సందర్భాలను మననం చేసుకుంటే దాదాపు నూట పాతిక సంవత్సరాల క్రితం, సాహిత్యం రాజాస్థానాలకు, రాణి వాసాలకు తరువాత అగ్రవర్ణాల ఆధిపత్యాలకు, ఆ తదుపరి కొన్ని భక్తి, రక్తి, భావాలకు పరిమితమైంది. అందులోనూ ఆయాకాలలో పూర్తి గ్రాంథిక, మత ప్రాతినిధ్య ధోరణులలోనూ కొందరు సంస్కర్తలు, ప్రజాకవులు అక్కడక్కడా కొన్ని జన బాహుళ్యాల ఉద్ధరణ కోసం ప్రజల భాషలో సాహిత్యాన్ని అందించారు. ఇది చారిత్రక సత్యం.

ఆ తదుపరి సాహిత్యాన్ని దాని గమనాన్ని పరిశీలిస్తే, గురజాడ, చిలకమర్తి, కందుకూరి లాంటి వాళ్ళు సమాజంలోని చెడుకు వ్యతిరేకంగా పోరాటపథం తీసుకుని అత్యుత్తమమైన సాహిత్యాన్ని వెలువరించారు. ఇదే ధోరణిలో ఆ మార్గాన్ని అందిపుచ్చుకొని 1940 నుండి శ్రీశ్రీ, పట్టాభి, ఆరుద్ర అలాగే విశ్వనాథ, జాషువా, తిలక్ కొంత మేరకు కృష్ణశాస్త్రి లాంటి వారు సాహిత్యాన్ని ప్రజా బాహుళ్యంలోకి తీసుకుని వచ్చారు. వారి వారి ధోరణి ఎదైనాకావచ్చు, శిల్పం ఏదైనాకావచ్చు. ఆ తర్వాతి కాలంలో దాశరథి సోదరులు సాహితీ మేఖల స్థాపకులైన అంబటిపూడి వెంకటరత్నం, కోవెల సోదరులు, ఆ తర్వాత ఎన్నో ఉద్యమాలు, ఉద్యమ సాహిత్యాలు, జనపదాలు, జానపద సాహిత్యాలు, వేళ్ళూనుకున్నాయి. కాళోజి నారాయణరావు గారు కుందుర్తి గారు సాహిత్యాన్ని సామాన్య ప్రజల హృదయాల్లోకి నాలుకలపైన తీసుకొని వెళ్ళినారు. 1950 తదుపరి కొన్ని వేల మంది సృజనకారులు కవులుగా, సాహితీ వేత్తలుగా, వివిధ రంగాలలో వివిధ రకాల సాహిత్యాన్ని అందించారు, అందిస్తూనే వున్నారు. వారి నుండి పరిశీలకులు, విమర్శకులు, సమీక్షకులు పుట్టి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు.

ఇందులో భేదాభిప్రాయాలు వుండవచ్చు. కానీ ఇది సూక్ష్మపరిశీలన మాత్రమేనని అందరం గమనించాలి.

స్వాతంత్ర్యానంతరం ప్రజాకవిత్వం ఉద్యమకవిత్వంగా జానపద సాహిత్యంగా కొన్నాళ్ళు ఉద్యమ జెండాలు ఎగరేసింది. తదుపరి అభ్యుదయ కవిత్వం, దిగంబర కవిత్వం, పైగంబర కవిత్వం, విప్లవ కవిత్వం, అనుభూతివాదం, పోస్ట్ మోడ్రనిజం, ఇలా రూపాంతరాలు చెంది రకరకాల వర్గాలుగా విడిపోయింది. అయినా అభ్యుదయ, విప్లవ కవిత్వాలే చాలా రోజుల నుండి నిలబడటం గమనార్హం. ఆ తదనంతరం దళిత, స్త్రీవాద, మైనార్టీ కవిత్వ ధోరణులు వస్తున్నాయి. ఇక్కడ కవిత్వం అంటే అన్ని రకాల సాహిత్యాలు అని గమనించాలి. కాగా గ్రంథరూపాల్లో లేనివి కొన్ని, ఉన్నవి కొన్ని తరతరాలుగా శ్రామికుల జానపదుల నాలుకలపై నడయాడి, నిజానికి వారి అంటే అట్టడుగు సామాజిక వర్గాల వాస్తవ జీవితాన్ని ధృవీకరించే పాటల సాహిత్యం మనకు అందుబాటులో వుంది. ఇంకా వర్ధిల్లుతూనే వుంటుంది.

అసలు ఈ చర్చంతా దేనికంటే ఇటీవల ఎన్నో చర్చలకు, వాదోపవాదాలకు దారితీసిన ఒక చిన్న పుస్తకం ఎన్నో ఆలోచనలకు రెక్కలు తొడిగింది. అయితే మనలో ఈ పుస్తకంలో చర్చించిన అంశాలు, విషయాలు, ఇంతకు ముందు లేవా అని ప్రశ్నించుకుంటే ఉన్నాయని చెప్పవచ్చు. ఇలాంటి అంశాలను చర్చకు తీసుకొచ్చే పుస్తకాలు గతంలో కూడా వచ్చి వుండవచ్చు. కానీ ఈ పుస్తకంలో కుండబద్దలు కొట్టినట్టు సంధిస్తున్న ప్రశ్నలు మన మనస్సులను ఆలోచనా సుడుల్లో పడవేసి అల్లకల్లోలం రేపి చలి జ్వరం తెప్పిస్తున్నాయని చెప్పవచ్చు. ఈ పుస్తకం వ్రాసిన కవి నిజాయితి, నియమబద్ధ పరిశీలనతో లేవనెత్తిన ప్రశ్నలు అతనిలోని ఆవేదనను ధృవీకరిస్తూ పాఠకుల హృదయాన్ని ఆలోచనా తరంగాల సుడిగాలుల్లోకి నెట్టి అల్లకల్లోలం చేస్తున్నాయి. కొత్త దారులకు మళ్లిస్తున్నాయి. ఇవన్నీ అందరికి తెలియదా అంటే తెలుసు. కానీ మనం ఆలోచించం. రకరకాల చట్రాల్లో, భావజాలాల్లో బంధించబడ్డ మనం అసలు ఆలోచించటానికి అశక్తులమే కాదు, పిరికివాళ్ళం కూడా అని నిస్సందేహంగా చెప్పవచ్చు. నిజానికి అందరం తలా ఒక వర్గంలో ఆలోచనా చట్రాల్లో బంధీలమై మరొకరి ఆలోచనలు, సాహిత్యం చదవటానికి, కనీసం శృసించడానికి కూడా ఇష్టపడని భావదారిద్ర్యంలో వున్నాం.


ఈ పుస్తకం వ్రాసిన వ్యక్తి యొక్క వ్యక్తిగతం ఎలాంటిదైనా ఆయన పూర్వసాహిత్యం ఎలాంటిదైనా, ఈ పుస్తక రచనలో అతని నిష్కల్మష హృదయం కనిపిస్తుందే తప్ప ఎలాంటి భావదారిద్ర్యాలు కనిపించలేదు. అందుకే "కవిగా జీవించండి... కవితై బ్రతకండి" అనే సందేశాన్నిఇస్తూ "అన్నిరకాల కవిత్వాలు చదవండి... ఆచరణను బేరీజు వేసుకోండి" అని "కవిత్వం వ్రాయడం మార్నింగ్ వాక్ కాదు. కవిత్వం అంటే కన్నీరు తుడవటం" అంటున్నాడు. అందుకే "మ్యాజిక్, మ్యూజిక్, లాజిక్ టెక్నిక్ తోపాటు ధైర్యాన్నినింపిన దివ్యమైన టానిక్ ఈ గ్రంథం" అన్న సీనియర్ కవి, రచయిత కవి రాజు గారి మాటలు నిజమనిపిస్తుంది. కొన్ని నిష్టుర సత్యాలకు ఎదురొచ్చి విమర్శిస్తూ దాడులు చేస్తున్న కుహనా విమర్శకులు, బృందాలకు జవాబుగా "అన్ని దాడులకు నేను తయారుగా ఉన్నాను" అంటున్నాడు ఈ గ్రంథకర్త. "నా ఈ పుస్తకం తర్వాత మరెందరో సాహిత్యకారుల అంతరంగాలు, ఈనాటి సమాజానికి అవసరం" అనడంలో ఈయనగారి వినమ్రతే కాకుండా ఇదే పూర్తి పుస్తకం అని చెప్పని ధోరణి కన్పిస్తుంది. "ప్రజలే కవులను, కళాకారులను సృష్టించుకుంటారు" అని సరికొత్త నిర్వచనం చెపుతూ "ఇంతకూ కవిత్వం అంటే ఏమిటి?" అన్నా మిస్టీరియస్ ప్రశ్నతో చదువరుని

> **1950 తదుపరి కొన్ని వేల మంది సృజనకారులు కవులుగా, సాహితీ వేత్తలుగా, వివిధ రంగాలలో వివిధ రకాల సాహిత్యాన్ని అందించారు, అందిస్తూనే వున్నారు. వారి నుండి పరిశీలకులు, విమర్శకులు, సమీక్షకులు పుట్టి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు.**

తన పుస్తకంలోకి లాక్కెళ్తున్నాడు. "కవిత్వం అంటే కసి తీర్చుకోవడం కాదు కన్నీరు కార్చటం కాదు" అంటున్నాడు.

"మన పిల్లలకు మంచి చెడుల గురించి చెప్పినట్లే, కొత్త తరానికి (కవులకు) మార్గదర్శనం చేస్తూనే వుండాలి". "అప్పుడు మాత్రమే ఏదో మేరకు ఆలోచిస్తారు" అన్న ఆశ అతని మ్యానిఫేస్టోలో కనిపిస్తుంది. "మన శత్రువు ఎవరో తెల్సుకుంటే ఆ కృషి ఫలవంతమవుతుంది" అని నిర్భయంగా చెప్తున్నాడు. ఈ గ్రంథ రచయిత యొక్క నిజాయితి, ఆవేదన స్పష్టంగా తెలుస్తున్నాయి.

"కవిత్వం మరణిస్తున్న ప్రక్రియ" అన్నాడు ఓ బెంగాలి కవి. "వాస్తవానికి ఇది కవుల మీద వచ్చే వ్యంగ్యం కావచ్చు. అతని బాధను మనం అర్థం చేసుకోవచ్చు. కవిత్వం మరణించడం అంటే సృష్టి అంతం అయినప్పుడే... నిజానికి మరణంలోనూ కవిత్వపు సంగీతం ప్రవహిస్తుంది" అంటూనే "ఎవరు ఎంత శవాలంకరణ చేసినా, శవం దహనం కావలసిందే... కాబట్టి కవిత్వం మరణించదు. అది మిగతా సాహిత్య ప్రక్రియల్లోకి చొరబడుతుంది" అంటున్నాడు ఈ కవిగారు. అతని ఆలోచనా తరంగాల్లో, ఈపుస్తకంలో వెలిబుచ్చిన అభిప్రాయాల్లో





**ప్రతులకు:**
పి. చంద్రశేఖర ఆజాద్
సెల్: 9246573575

చాలా స్పష్టత వుంది.

"కవిత్వం ఒక తీరని దాహం" అన్న శ్రీశ్రీ గారి కొటేషన్ వుటంకిస్తూ "అమృతం తాగితే వచ్చే శాశ్వత జీవితంకన్నా కొన్ని కవిత్వపు క్షణాలు చాలు" అంటూ నేను కవిత్వాన్ని ప్రేమిస్తాను, దాని కోసం జీవిస్తాను, దాని కొరకే మరణిస్తాను. అంటూ కవిత్వం పట్ల తనకున్న ప్రేమను వెల్లడిస్తున్నాడు. కవిత్వపు జెండా నా అజెండా అని ప్రకటిస్తున్నాడు.

"ఇప్పుడు కవిత్వం ఎందుకు పలుచబడింది? కవిత్వం బ్రహ్మ పదార్థంగా ఎందుకు మారిపోయింది? అన్న ప్రశ్నకు స్పందిస్తూ తనని తాను కూడా విశ్లేషించుకుంటూ ఆలోచిస్తున్న క్రమంలో "కవిత్వ నిర్మాణంలో ఇదివరకటి శ్రద్ధ వుందా? అధ్యయనం ఉందా? కొత్త పాఠకుడిని తయారు చేయగలగుతున్నామా?" అన్న ప్రశ్నలు అతని ఆత్మ పరిశీలనగా మారి వుండవచ్చు. అందుకే ''ఇంకో పది సంవత్సరాల తర్వాత వ్రాయవలసింది ఇప్పుడే వ్రాస్తున్నాను" అంటున్నాడు. అతని మేధస్సును ఎంతో కాలం నుండి వేదిస్తూ, అందులో గిరికీలుకొడ్తున్న ఆలోచనా ప్రవంతి ఇదికావచ్చు. కానీ గమ్మత్తుగా ఇతనికి కవిత్వం మీద ప్రేమ గౌరవం భక్తి కూడా వున్నాయి. అవే ఈ పుస్తకం వ్రాయడానికి ప్రేరణ అనవచ్చు.

"సౌందర్యాన్ని పట్టుకోగలిగేది కవులు మాత్రమే... నిజానికి మన చిరునామా మన కవిత్వం... కవిత్వం ఏ ఒక్కరి సృష్టి కాదు. సంపద కూడా కాదు... కవిత్వపు లోతులు తెలుసుకోవటానికి ఒక మహా యుద్ధం చేయాలి? అంటున్న ఈ కవిగారు "మనం ఈ అద్దాల గదులో ఉన్నాం. "లోపల నుండి బయట నుండి ప్రమాదమే" అని హెచ్చరిస్తున్నాడు.

"నేను కూడా మోడ్రన్, పోస్ట్ మోడ్రన్ విచిక్సిచ్చులో పడ్డాను". దానికి సమాధానంగా "అసలు సమాజం ఆధునికం అయిందా'' అన్న సందేహం'' వెలుబుచ్చుతున్నాడు. అంతలోనే "కవి మీద నమ్మకం కోల్పోకు... పోయట్స్ ఆర్ హీలింగ్ పవర్స్" అంటూ "కవిత్వం అంటే బ్రీవిటి" అని ఆ బ్రీవిటి కోల్పోయిన కవులను, విమర్శకులను, ఉపన్యాస శిఖామణులను చూసి బాధపడుతున్నాడు. "అయినా కవిత్వం వ్రాసి డబ్బు సంపాదించేవారెవరో వెత్తుక్కోవాలి" అని నిరాశపడుతున్నాడు.

ఈ పుస్తకాన్ని పరిశీలిస్తే నేడు కన్పిస్తున్న "స్వకుచ" "పరకుచ" "పరస్పర కుచ" మర్ధనాలన్ని పరోక్షంగా ఏవగించుకుంటున్నాడు. సభలలో చెప్పే అభిప్రాయాలకు, వ్యక్తిగత అభిప్రాయాలకు పొంతన లేని తనాన్ని నిలదీస్తున్నాడు. ముందు మాటల్లో చెప్పిన విషయాలకు అంతర్గత ఆలోచనల తేడాల, డొల్ల తనాన్ని ఈసడించుకుంటూ విమర్శకులు, సాహిత్య పండితులు, సభా మర్యాదలను విస్మరించి తమ తమ పాండిత్య ప్రదర్శనకు సమయహరణ చేయడం పట్ల బాధపడుతున్నాడు.

అసలు వర్గాలుగా, కుల, మత, జెండర్ ప్రాతిప్రదికన శిబిరాలుగా విడిపోయినవారు ఆయా మాయ భావజాలాలతో సాహిత్య సృజన చేస్తున్న వాళ్ళ గురించి చెపుతూ "వారి కవిత్వంలో ఎంత నిజాయితి ఉంది? వారు చెప్పింది వ్యక్తులుగా ఆచరిస్తున్నారా? అవి ఎవరికోసం వ్రాస్తున్నారో ఆయా వర్గాలకు ఈ కవిత్వాలు అందుతున్నాయా? అసలు వారంతా పురోగమన దిశలోనే వున్నారా, లేక తిరోగమిస్తున్నారా? వర్ణ సంకరానికి ముందుకు వస్తున్న వారు వర్గ సంకరానికి ముందుకొస్తారా? అని ప్రశ్నిస్తూ "ఆర్థికంగా బలపడిన వారికి కులం మతం సిద్ధాంతాలు మృతప్రాయం అవుతాయి'' అంటున్నాడు ఈయన. "మనం రాబిన్ హుడ్ లమా? హెర్క్యులెల్స్‌మా? కాలక్షేప బఠానీలమా?" ఆలోచిం చాలంటున్నాడు.

"ఒకప్పుడు జనం మధ్యలో కవితాపటణాలు, సాహిత్య సభలు జరిగేవి. ఇప్పుడు ఫాం హౌజులలో ఎందుకు జరుగుతున్నాయి? పబ్బుల్లో, క్లబ్బుల్లో, పుస్తకావిష్కరణలు ఎందుకు చేస్తున్నారు? అన్న ప్రశ్నలతో ఆవేదన చెందుతూ, కేపిటలిస్టిక్, పొలిటికల్, బూర్జువా, కుహనా రాజకీయ ఎత్తుజిత్తుల మాయలో పడి కొట్టుకుపోతున్న నేటి కవుల సాహిత్యకారుల ధోరణులను చూసి బాధపడ్తున్నాడు. సామాన్య జనం నుండి కవిత్వాన్ని, కవులను పై వర్గాలు ఎలా హైజాక్ చేసింది, వీళ్ళు అమాయకంగా ఎలా హైజాక్ చేయబడ్డది వివరిస్తూ ఆత్మపరిశీలన చేసుకోవాలంటున్నాడు.

ఒక జాతినీ, దేశాన్నీ, ప్రాంతాన్ని నాశనం చేయాలన్నా వారిపై ఆధిపత్యం వహించాలన్నా లేదా పూర్తిగా ఆక్రమించుకోవాలన్నా, వారి వారి సాహిత్య సాంస్కృతిక సాంప్రదాయాలను నాశనం చేయాలన్న వారి ఆలోచనలు పైన వివరించిన వర్గాలకు బాగా తెలుసు. అందుకే తరతరాల

> **ఈ పుస్తకాన్ని పరిశీలిస్తే నేడు కన్పిస్తున్న "స్వకుచ" "పరకుచ" "పరస్పర కుచ" మర్ధనాలన్ని పరోక్షంగా ఏవగించుకుంటున్నాడు. సభలలో చెప్పే అభిప్రాయాలకు, వ్యక్తిగత అభిప్రాయాలకు పొంతన లేని తనాన్ని నిలదీస్తున్నాడు.**

నుండి మన దేశ చరిత్రను, ప్రస్తుతాన్ని కూడా పరిశీలిస్తే విభజించు పాలించు అనే సూత్రం పై వర్గాల వారు అనుసరిస్తూ మనందర్ని బానిసలుగా మారుస్తున్నారు. ఆ మార్గంలోనే కొన్ని కొన్ని బలహీనతలున్న మేధావులను లొంగదీసుకుని, లేదా కొందరిని తయారు చేసి మన దేశ సాహిత్య సాంస్కృతిక సాంప్రదాయాలను నాశనం చేసేందుకు రకరకాల వర్గాల, కులాల, మతాల లింగభేదాలు, సృష్టించి ఆలోచనలు నిర్వీర్యం చేసే కలహాలు సృష్టించి ప్రజా చైతన్యాలను అణగదొక్కుతున్నారు. ఇదొక భయంకరమైన కుట్రపూరిత నిరంతర ప్రక్రియ, ''అందుకే ఒక జాతి అంతర్యుద్ధములో నిర్మూలనంకావడం మించివారికి కావల్సిందేమిటి?" అని ప్రశ్నిస్తూ అందరినీ ఆలోచించమంటున్నాడు.

ఇకపోతే అన్ని కవిత్వ ఉద్యమాలకు కొందరు స్వయం ప్రకటిత పీఠాధిపతులు తయారై తమలోని మౌఢ్యాన్ని పదిమందికి పంచుతూ, తాము చెప్పిందే వేదం అని ప్రచారం చేస్తూ - భ్రమలు కల్పిస్తూ సాహిత్య కారులను తమ తమ వర్గాల్లోకి ఆక్టోఫస్ ల్లా లాగుతూ ముఠాలు తయారు చేస్తున్నారు. ఆయా పీఠాధిపతులు ఆధిపత్య ధోరణి లో వున్న అగ్రరాజ్య, పెట్టుబడి దారి, బూర్జువా వర్గాలకు బానిసలై ఆయా వర్గాల బ్రాండ్ అంబాసిడరులుగా మారి వాళ్ళు చలువరాతి మేడలను సమకూర్చుకొని వారి మాటలకు ఆయా వర్గాలలో చేరిన అమాయకుల కలలను ఆశయాలను గాలి మేడలు చేస్తున్నారు. ఆయా సోకాల్డ్ పీఠాధిపతులు స్టార్ హోటలల్లో నిరంతర మద్య పాన వేశ్యా విలాసాలలో మునిగి తేలుతూ "ఇది సాహిత్యం", "ఇదే సాహిత్యం" అని సిద్ధాంతీకరించడం విచారించదగ్గ విషయం. ఆ నిజాలన్నింటిని ప్రస్ఫుటంగా వెల్లడిస్తూ అమాయకంగా బలికావద్దని హెచ్చరిస్తున్నారు ఈ కవిగారు.

అవార్డులు, పురస్కారాలు కొన్ని సంస్థలు, యూనివర్సిటీలు, అకాడమీల డొల్లతలాన్ని ఎత్తి చూపుతున్నాడు. కొందరు డబ్బు ఉన్నా లేదా డబ్బులు సంపాదించిన తర్వాత ఏమీ తెలియకున్నా సాహిత్య రంగాల్లోకి ప్రవేశించి, కొన్ని సంస్థలను ఏర్పాటు చేసి చెస్తున్న మాయాజాలాలని ప్రశ్నిస్తున్నారు ఈయన. "నీకిది... నాకిది" అన్న పద్ధతి ఈ అవార్డుల్లోకి ప్రవేశించి చాలా కాలం అయింది అని బాధపడుతూ, దీనికి కొన్ని పత్రికలు, ఛానళ్లు కూడా అతీతం కాదంటున్నాడు. దీని ద్వారా ఎందరో అనర్హులు అవార్డులు, పురస్కార గ్రహీతలు అవుతున్నారని స్పష్టంగా చెప్తున్నారు.

సందర్భానుసారంగా ప్లాబో నెరుడా కవితను, టాల్ స్తాయి కన్ ఫెషన్ ని కూడా ప్రస్తావిస్తూ, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య మాటలు చెప్తూనే కొద్దిగా మనస్సు మార్చుకుని ఎంతో లబ్ది పొందుతున్న అభ్యుదయ, విప్లవ రాజకీయ నాయకులను, గతంలో మంచి సాహితీవేత్తలు పేరుపొందిన వారిని ఆత్మపరిశీలన చేసుకోమని చెపుతున్నాడు.

ఈ పుస్తకం చదువుతున్నప్పుడు, చదువరులు ఇందులో వున్న అన్ని విషయాలు ఆమోదించక పోవచ్చు. అయినా ఈ కవిగారు కూడా ఇంకా చర్చలు జరగాలనే చెప్తున్నాడు. "ఈ ప్రయత్నం తర్వాత మరెందరో కవుల అంతరంగాలను ఆవిష్కరించడం నేటి సమాజానికి తక్షణ అవసరం" అంటూ నవమల్లెతీగ సంపాదకులు, ప్రచురణ కర్త "కలిమిశ్రీ" గారు కూడా చెప్పడం ఆమోదించాల్సిన విషయం.

"స్తబ్దత నుండి చలనం విస్ఫోటనంగా బయటపడుతుంది'' అన్న నిజాన్ని ఈ రచయిత కూడా ఉటంకించడం జరిగింది. అందుకే అన్ని చర్చల తర్వాత కొందరైనా ఆత్మ పరిశీలన చేసుకొని "విస్ఫోటనం" కాకున్నా, కనీసం "చలనం" అవటానికి కారకులవుతారన్న చిన్న ఆశ.

ఏది ఏమైనా ఒక చిన్న స్పందన కల్గించే పుస్తకం "కవిగారి అంతరంగాలు" వ్రాసిన శ్రీ పి. చంద్రశేఖర అజాద్ గారికి, దాన్ని ప్రచురించి సాహిత్యలోకానికి అందించిన నవమల్లెతీగ యాజమాన్యం వారికి అభినందనలు తెలియజేయకుండా ఉండలేము.

సాహిత్యకారులంతా ఈ పుస్తకాన్ని తప్పనిసరిగా చదివి వారి వారి స్పందనలు తెలియజేస్తూ, సాహితీ లోకానికి వినూత్న మార్గాలను ఏర్పర్చాలని కోరుతున్నాను.

నేను వ్రాసిన విషయాలన్నీ పై పుస్తకం "కవిగారి అంతరంగాలు" చదివిన తర్వాత నా యొక్క మనస్సులో చెలరేగిన అంతరంగ తరంగాలు.

**- చకొనా**
9885797375

## కిం కర్తవ్యం

మానవుడు దానవుడైతే
మానవత్వం మంట కలుస్తుంది!
వికసించిన మానవ మేధో పరిజ్ఞానం
ఇవాళ సమాజాన్ని
అణుబాంబుల రూపంలో
బుగ్గి చేస్తుంది!
ఏం లాభం?
అనాగరిక మానవుడు
ప్రకృతి శక్తుల మీద పోరాటం
చేసి నాగరికుడయ్యాడు!
నిరంతరం పరిశ్రమిస్తూ
సమున్నత శిఖరాలకు
అధిరోహించాడు!
శాస్త్ర సాంకేతిక రంగాల్లో
సాధించిన ప్రగతిని
సమాజ సుఖాల కోసం
అనువర్తనం చేశాడు!
ఇపుడు అదే జ్ఞానాన్ని
తిరోగమనం వైపు మళ్లిస్తూ
మారణాయుధాలతో
జెట్ స్పీడుతో బాంబుల
వర్షం కురిపిస్తూ
రాక్షసానందం పొందుతున్నాడు!
ఇట్లా మనుషుల్ని మనుషులు
కాల్చుకు తినడం
ఏ నాగరికతకు ప్రతిబింబం?
మళ్ళీ మనిషి అనాగరికుడౌతున్నడా?
స్వార్థాన్ని త్యజించి
ప్రపంచ శాంతి కోసం ప్రతి
ఒక్కరు పాటుపడితేనే
ఇవాళ ప్రపంచ శాంతి
సౌభ్రాతృత్వం వర్ధిల్లుతుంది!
ఆ దిశగా ప్రయత్నించడమే
మన ముందున్న తక్షణ కర్తవ్యం!!

-డా॥ దాశరథుల నర్సయ్య
9390919100



## ఇప్పుడిహ కలలకు కాలం చెల్లిపోయింది

చెట్టూ చేమా మిద్దెపైనెక్కి బిక్కు బిక్కుమంటూ
ఒంగి ఓదారుస్తున్న నీలాకాశం ఒడిలో ఒదిగి
మాటరాక ఓదార్చలేక బిగిసిపోయిన గాలి మెత్తని స్పర్శకు
కరిగి కన్నీరవుతూ చూస్తుంటే
గాజు అద్దాల మధ్య ప్రపంచం మొత్తం కాచివడబోస్తూ
వెచ్చదనమూ సమశీతలమూ
పెంపుడు కుక్కల్లా అదుపులో పెట్టుకు
దివా రాత్రాలకు తేడా లేనంతగా ఆధునికత పులిమాక
నిద్ర రాని కళ్ళకు నీడలు సోకని ఉనికికీ
స్వప్నాల మాటెక్కడ?
అహరహమూ అప్రమత్తమై ఉండే మనసుకు
కలల మాటెక్కడ?
వేలికొసలనిండా యంత్రాల సరిగమలూ
చూపు చివరంచుల వరకూ ఆకాశ హర్మ్యాల ఆశలూ
గుండె నిండా కల్మషాల మురిక్కాలవలూ
అణువు అణువునా కుప్పిగంతులు వేస్తున్న క్రూరత్వం
ఎదుటి వారి నడి నెత్తిన చెయ్యుంచి
పచ్చని నేలలను మేసి విశ్రమించే
పసిరిక పాముల కాలం ఇది
ఇంటింటా గొంతెత్తి తీతువులు గానం చేసే
రాజకీయాల మారణ హోమం ఇది
ఇప్పుడిహ కలలకు కాలం చెల్లింది.
కలవరించవలసినది మహాభారత సంగ్రామమే

-స్వాతీ శ్రీపాద
8297248988



## ఈ పాపం ఎవరిది

ఒకరి ఆలోచనలకు ఆనవాలుగా
ఒకరి అహంకారానికి ఆహుతులుగా
మరొక్కరి పెత్తనానికి పైత్యానికి పరాకాష్టగా
రాజ్యమేలుతూ రగులుతున్నది రణరంగం
దేశభక్తికి ప్రాణాల విలువకు తులాభారంగా
తరాజు వేస్తున్న ఓ ప్రపంచమా
మానవత్వం మర్చిపోవడం నీ నైజమా
పసి నవ్వులు ఏ పాపం చేశాయో
ప్రతి సృష్టికి దేవతలకు ఏ శాపం తగిలిందో
యువకులందరికీ ఏ ఉరుసు ఉరిమిందో
వయసుతో సంబంధం లేని
ఈ మరణ మృదంగానికి ముందుగా
బలి అవుతున్నారు సామాన్య ప్రజలకు
ఎందుకు ఈ పరీక్ష ఏమిటి శిక్ష
ఈ రక్తపాతానికి ఏ పాత్రను నిందించాలి
ఎవరిని ప్రశ్నించాలి..?
యుద్ధం అనివార్యమా..
యుద్ధం నిర్విరామమా..
శాంతి కాంక్ష లేని రాజ్యాల్లో
రగులుతున్న
ఈ నిర్ణయాల జ్వాలలో
అగ్నికి ఆజ్యం తోడైనట్లు
నవ్య టెక్నాలజీ తో నరమేధంతో
నరాలు తెగిపోయే ఈ భయానక
దృశ్యాలకు సాక్షులుగా నిలవక
శాంతిని కాంక్షిస్తూ
కలిసి జీవిద్దాంమా
యుద్ధమా
ఓసారి
ఆలోచించు.

-వై.రమ్య
6305408398



# ఎదురు తిరిగిన విధి

(కథ)



నాటి తరం వారి కథలు నేటి తరానికి **కథల వంతెన**

**1959లో రాసిన కథ**

సంధ్యవేళ అయింది. ఆవులన్నీ ఇళ్ళకు చేరుకున్నాయి. సంతకు వెళ్ళిన భర్త గోపాలం కోసం ఎదురుచూస్తోంది జానకమ్మ. ఆయన వచ్చే వేళయింది. కాని ఇంకా రాలేదు. ఆవులన్నింటి పాలు పితికించి దూడల్ని వదిలింది. ఆలోచనల్లో పడిపోయింది.

"ఈ తెల్లావు ఇంకో నెలవరకు ఈనుతుంది. సరైన పోషణ లేకపోవడం వల్ల కావొచ్చు, పక్కటెముకలు బయటకు కనిపిస్తున్నాయి. ఈయన మళ్ళీ సంతకు వెళ్ళినపుడు తెలగపిండి తీసుకురమ్మనాలి." గోపాలం మళ్ళీ మనసులో మెదిలాడు. పూర్తిగా చీకటి పడింది. వీధి దీపాలు వెలిగాయి. గొఱ్ఱెల్ని "మంద పెట్టడానికి" గొల్లలు పొలాల వేపు తోలుకెళ్తున్నారు.

"ఇంకా రాలేదు. కొంప దీసి ఆయనకు ఏం జరుగలేదు కదా?"

తన వెర్రి ఆలోచనలకు తానే నవ్వుకుంది జానకమ్మ. నిక్షేపంలాంటి ఆయనకేమవదు. ఎన్నిసార్లు వెళ్ళలేదు? కాని ఈపాటికల్లా నడుం వాల్చాల్సిన టైం" అనుకుంది.

"కొంపదీసి.. అదేదో పట్నంలోనే వాల్చేసి రాడు కదా!" అనుకుంది జానకమ్మ.

గోపాలం రసికుడే. అతని రసికత్వం జానకమ్మకు బాగా తెలుసు. కాని వారించ లేకపోయింది. "మగాడన్న తర్వాత అప్పుడప్పుడు వీధి తిళ్ళు తింటేనే, ఇంటి రుచి తెలుస్తుందే!" అన్న జవాబు వచ్చేది ఆయన దగ్గర్నుండి.

అలా వెళ్ళాలన్న ఆలోచన ఉన్నవాడు సిలుకు లాల్చీ, ధోవతి వేసుకుని, సెంటు పులుముకుని, విడెం నములుతూ 'అలా సంతవేపు వెళ్ళొస్తానే' అంటూ జానకమ్మ వేపు కొంటెగా కన్నుగీటేవాడు.

అంతా అర్థమైనా, ఏమీ అనేది కాదు. ఆమెకు తెలుసు ఈ విషయంలో భర్త ఎవరి మాటా వినడని. పైగా "సంసారులు సరసానికి పనికి పనికి రారు" అంటూ ఆమె కళ్ళలోకి చూస్తూ అదోలా నవ్వేవాడు. కాని నేడలా వెళ్ళలేదు. సాదా చొక్కా, కావి పంచెతో బయల్దేరాడు.

"ఇంతసేపైనా రాలేదు. కారణం ఏమై ఉంటుంది" అనుకుంటున్న ఆమె మనసు పరిపరి విధాలా పోయింది.

"ఏమిటో ఈ వెధవ తిరుగుళ్ళు! కుదర్చలేని రోగాలూ రొష్ఠులూ అంటారు. ఇక ముందు నుండీ మానెయ్యమని గట్టిగా చెప్పాలి" అనుకుంది.కాని జానకమ్మ చెప్పలేదు. ఈ మాటలు అంటే గోపాలం చిన్న బుచ్చుకుంటాడు. తన కళ్ళలోకి అదోరకంగా చూసేసరికి కరిగిపోయి మారు మాటాడలేకపోతుంది.

అలా కరిగిపోవడానికి కారణముంది.

చెదురుముదురుగా వస్తున్న ఆలోచల్ని అదుపులో పెట్టాలనుకుంది.కాని అవి ఆమెతో ప్రమేయం లేకుండా అలానే రాసాగాయి.

పదహారేళ్ళ ప్రాయంలో తనూ సంత చూసింది. బహుశా అదే మొదటిసారి. సంతకు వాళ్ళూరు ఎంతో దూరం లేదు. పచ్చగడ్డి మోపు ఎత్తుకుని సంతవేపు నడిచింది. ఊళ్ళోకంటే సంతలో మంచి ధర గిడుతుంది.

ఎక్కడ చూసినా సందడి. కోలాహలం. అరుపులూ, కేకలు, జనం. వెర్రెక్కినట్లయింది జానకమ్మకు. 'గడ్డిమోపు' అంటూ అరవాలని కూడా అనిపించలేదు. అలా ఎంత దూరం నడిచిందో తెలియదు.

"ఏయ్ గడ్డిమోపూ ఇలారా!" అన్న అరుపు విని ఈలోకంలోకి వచ్చింది. పాతికేళ్ళ యువకుడు ఇంటిముందు నుంచుని పిలుస్తున్నాడు.

"గడ్డిమోపు ఎంత" ప్రశ్న.

"ముప్పావలా"తన జవాబు.

"సరే ఇలా వేసిపో.. ఇటు.. ఈ పెరట్లో".. ఆయన చెప్పిన చోటికి చేష్టలుడిగిన మేకలా నడిచింది.

"ముప్పావలా కదూ" ఆయన కళ్ళలో జీర, క్రౌర్యం. ఇవేమీ ఆమెకు తెలియవు.

బలమైన చెయ్యొకటి ఆమె నడుం చుట్టూ కొండచిలువలా బిగుసుకుపోయింది.

ఏదో దిగ్భ్రమ. ఏదీ తెలియని, లౌక్యం లేని మనస్సు. ఏదో మత్తు, అరమోడ్పు, మాధుర్యం, భయం ఆమెనావహించాయి.

అరగంట క్షణంలాగే గడిచిపోయింది.

సిగ్గుతో, భయంతో అతని కళ్ళలోకి చూసింది. నేరస్తునిలా తల ఎటేపో త్రిప్పుకున్నాడా యువకుడు. అయిదు రూపాయల నోటు చేతిలో ఉంచి వెళ్లమన్నాడు.

బాధ, మాలిన్యపు గుర్తులతో ఇంటికి చేరింది ఆమె.మాలిన్యపు తాలూకు నీడలు తొమ్మిది నెలల వరకూ ఆమెని వదల్లేదు. మాలిన్యం అంతా ఓ చిన్నారి శిశువులా కడుగుకు పోయింది.

ఆ తరువాత కూడా ఓ అయిదేళ్ళపాటు అజ్ఞాతంలో ఉండవలసి వచ్చింది ఆమెకు.

తనకి పెళ్ళి చేయాలంటూ కాలికి బలపం కట్టుకుని తిరిగాడు తండ్రి. కూతురు పెరిగి పెద్దదవుతోంది. అచ్చు తన రూపే పెద్ద కళ్ళు. గులాబీ బుగ్గలు. చెంప మీద చేరెడంత మచ్చ. "మంగ" ఎంత ముద్దొస్తుండేదో. చూడకుండా ఉండలేక పోయేది. చూసినప్పుడల్లా గుండె కలుక్కుమనేది.

జానకమ్మకు పెళ్ళి నిశ్చయమైంది. ఏ అందచందాలు ఆమెను కళంకితురాల్ని చేసాయో అవే తండ్రికి అంత బరువు కాకుండా గోపాలంతో ఆమెను ముడివేసాయి.

మంగ తనకు దూరమవుతుందని తెలిసి ఎంతగానో ఏడ్చింది. లోకం హర్షించదని తెలిసినా, కన్న కడుపు అనుబంధం బలవంతాన త్రెంచుకోవాల్సి వచ్చింది. తండ్రి సంతలో ఎవరికో ఇచ్చాడట బిడ్డని. కన్నకూతురు తాను బ్రతికి ఉండగానే అనాథ అయిందే అన్న ఆలోచన గుండెలో కలుక్కుమంటుండేది. కాని తన బ్రతుకు ముందు కన్న కూతురి భవితవ్యం పెద్ద గీత ముందు చిన్నగీత అయింది.

"మంగ ఎలా ఉందో.. ఎలా తెలుసుకోవటం? ఏమో.. దానికిప్పుడు పంతొమ్మిది ఏళ్ళు. పెళ్ళి చేసుకుందా? ఎలా ఉందో దాని జీవితం! ముద్దొచ్చే ఆ ముఖంలో ఆ మచ్చ ఎంతో ముచ్చట గొలిపేది. సంతోషంతో ఆ మచ్చను ఎన్నిసార్లు ముద్దిడుకుందో! ఏది ఏమైనా కన్నకూతురి జీవితం అస్తవ్యస్తం కాకూడదు" జానకమ్మ కళ్ళు వర్షిస్తున్నాయి. ఇంటి ముందర ఆయన గొంతు వినిపిస్తోంది. కళ్ళు తుడుచుకుని ఈ లోకంలోకి వచ్చి తలుపు తెరిచింది. మామూలుకంటే హుషారుగా ఉన్నాడు గోపాలం.

"నడిరాత్రి అయ్యేదాకా ఏంటా తిరుగుళ్ళు. పెందరాళే రావొద్దూ!" ఆమె మందలింపు.

"అవునే ఈవేళ ఓ చక్కని చుక్క కనిపించింది. మొదట అలా అనుకోలేదు. కాని దాన్ని చూసాక వదల మనసొప్పలా"

"ఊహూఁ నేననుకున్నట్లే అయిందన్న మాట" నవ్వుకుంది జానకమ్మ.

"రంభే గుర్తుకు వచ్చిందనుకో!"

"చాల్లెండి మీ నిర్వాకం. ముందుర కాళ్ళు కడుక్కుని రండి. వడ్డిస్తున్నాను" అంటూ తెచ్చిపెట్టుకున్న కోపంతో కసిరింది.

"ఇంత వయసొచ్చినా ఇవేం బుద్ధులు?"

"చెప్పనివ్వవే! ఎంతడిగిందనుకున్నావ్! పాతిక, అమ్మో అనుకున్నాను. కాని చిన్నది చాలా గడుసుదేలే..నువ్వే యవ్వనంలో సంతకొచ్చావనిపించిందనుకో.."

భోజనానికి కూర్చున్నాడు గోపాలం.

"ఇవ్వాళ నా జిహ్వకు రుచి తగిలిందనుకో"

ఈయనకీ వేళ ఇక అన్నం సయించదు అనుకుంది.

ఆయన్ను కాస్త ఉత్సాహంగా ఉంచాలనుకుని "భలేగా ఉన్నాయి మీ సంగతులు. ఇంతకూ.. నా సవతి పేరేంటన్నారు? చంద్రవంకా? సూర్యవంకా? కన్నొంకా? కాలొంకా?"


"అవేమీ కావే.. మాంచి పేరు.. మంగ, అలివేలు మంగ.

"ఆఁ" అని అదిరిపడింది జానకమ్మ

ఆయన అదే ఉత్సాహంతో చెప్పుకుపోయాడు.

"చెంపమీద చేరడంత పుట్టుమచ్చ, ఎంత ముద్దొచ్చిందనుకున్నావు? వందసార్లన్నా ముద్దు పెట్టుకున్నాననుకో..."

జానకమ్మ చేతిలోని మంచినీళ్ళ గ్లాసు "బండాలున" నేలకు పడింది. నీళ్ళన్నీ ఒలికిపోయాయి. ఆమె హృదయంలా, ఖాళీగ్లాసు అటూ ఇటూ దొర్లుకుపోయింది.



**– కూర చిదంబరం**
సెల్: 8639338675

**"ఆమెకు తెలుసు ఈ విషయంలో భర్త ఎవరి మాటా వినడని. పైగా "సంసారులు సరసానికి పనికి పనికి రారు" అంటూ ఆమె కళ్ళలోకి చూస్తూ అదోలా నవ్వేవాడు"**


# సునంద సరికొత్త ప్రయోగం "సాహిత్యంలో న్యాయాలు"

భారతీయ తాత్త్విక సాహిత్యంలో న్యాయాలు ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయి. న్యాయం అంటే ఒక తాత్పర్యాన్ని లేదా ఆలోచనను స్పష్టంగా తెలిపే దృష్టాంతం. ఒక చిన్న ఉదాహరణ ద్వారా లోతైన సూత్రాన్ని చెప్పడం న్యాయాల లక్ష్యం. ఇవి కేవలం తర్కశాస్త్రానికి చెందినవే కాకుండా, వేదాంతం, ధర్మశాస్త్రం, సాహిత్యం వంటి అనేక రంగాల్లో ఆలోచనాత్మక రూపకాలు లా విస్తరించాయి. న్యాయాల ద్వారా ఒక వాక్యం, ఒక భావం, లేదా ఒక పరిస్థితి మనసుకు చేరువగా అవుతుంది.

తెలుగు సాహిత్యంలో న్యాయాల ప్రాముఖ్యత చాలా విస్తృతమైనది. ఒక కవి తన భావాన్ని రూపకంలో మలచి, పాఠకుని మనసుకు చేరే విధంగా చెప్పడానికి న్యాయాన్ని ఉపమానంగా వాడుతాడు. ఉదాహరణకు అంకోల బీజ న్యాయం జీవుడు తన మూలానికే తిరిగి చేరడాన్ని, ఆత్మాశ్రయ న్యాయం తానే తనకు ఆధారం కావడం అనే తర్కదోషాన్ని తెలియజేస్తాయి. ఈ రెండు న్యాయాల మధ్య వ్యత్యాసం సాహిత్యంలో భావం మరియు తర్కం మధ్య ఉన్న సున్నితమైన సమతుల్యాన్ని చూపిస్తుం ది. ఈ సమతుల్యతే సాహిత్యాన్ని లోతుగా, విశ్వసనీయంగా చేస్తుంది.

శ్రీమతి పురిమెళ్ళ సునంద గారి "సాహిత్యంలో న్యాయాలు (సునంద భాష్యం)" అనే గ్రంథం ఈ విషయాన్ని ఒక కొత్త దిశలో పరిశీలిస్తుంది. ఆమె 116 న్యాయాలను ఎంపిక చేసి, ప్రతి న్యాయానికి సాహిత్యార్థం, మానవీయ అర్థం, తాత్త్విక భావం కలిపి వ్యాఖ్యానించారు. ఆమె రచనలో శాస్త్రీయతతో పాటు సాహిత్య సౌందర్యం ఉంది. న్యాయాలను తర్కశాస్త్ర పరిమితుల్లో ఉంచకుండా, అవి మన జీవితానుభవాలకు, మన భావజీవితానికి సంబంధించినవిగా చూపించడం ఆమె ప్రత్యేకత. సునంద వ్యాఖ్యానంలో తర్కం సున్నితమైన భాషలో కరిగిపోయి కవితాత్మకంగా అనిపిస్తుంది. ఉదాహరణకు క్షీరోదక సంపృక్త న్యాయాన్ని ఆమె మనిషి బంధాల మాధుర్యానికి, భావసాన్నిహిత్యా నికి ప్రతీకగా వివరిస్తుంది. అంకోల బీజ న్యాయాన్ని ఆత్మసాధన, బ్రహ్మలయ స్థితికి సంకేతంగా చూపిస్తుంది. ఈ విధంగా ఆమె తత్త్వాన్ని సాహిత్య రూపం లో, సాహిత్యాన్ని తత్త్వరూపంలో మ లచారు. సాహిత్యంలో న్యాయాల ప్రాధాన్యం కేవలం ఉపమానాత్మకతలోనే కాదు. అవి సాహి త్యానికి తాత్త్విక బలాన్ని ఇస్తాయి. ఈ గ్రం థంలోని న్యాయాలు సాహిత్యాన్ని ఆలోచ నాత్మకంగా చేస్తాయి, మానవీయ భావానికి ఒక దిశను ఇస్తాయి. కవి తన భావాన్ని రూపకంగా, విమర్శకుడు తన విశ్లేషణను తర్కపరంగా, పాఠకుడు తన అనుభూతిని భావపరంగా విస్తరించడానికి న్యాయాలను ఆధారంగా తీసుకుంటాడు.

పురిమెళ్ళ సునంద గారి **"సునంద భాష్యం"** ఈ మూడు స్థాయిలను సమన్వయపరుస్తుంది. ఆమె రాతలో పాండిత్యం ఉన్నప్పటికీ భాష సరళంగా, ఆలోచన లోతుగా ఉంటుంది. ప్రతి న్యాయం వెనుక ఆమె చూపే దృశ్యకోణం పాఠకుని ఆలో చనను మేల్కొలిపేలా ఉంటుంది. అందు వల్ల ఈ రచన కేవలం తర్కసం బంధ గ్రంథం కాదు. అది సాహిత్యా త్మకమైన అనుభవం. సాహిత్యంలో న్యాయాలు మనకు ఒక విలువైన పాఠం చెబుతాయి. సాహిత్యం అనేది భావం మరియు బుద్ధి మధ్య సమతుల్యత. భావానికి తర్కం తోడైతే అది కవిత్వం అవుతుంది, తర్కానికి భావం తోడైతే అది తత్త్వం అవుతుంది. ఈ రెండు కలిసినప్పు డు మాత్రమే సాహిత్యం సంపూ ర్ణంగా అవుతుంది. పురిమెళ్ళ సునంద రచన ఈ సమతుల్యతను అందంగా చూపిన ఉదాహరణ. ఆమె న్యాయాలను పున ర్వ్యాఖ్యానిం చి వాటిని మన కాలా నికి దగ్గరగా తెచ్చి, సాహిత్యం మరియు తత్త్వం మధ్య ఉన్న అనుబంధాన్ని మనకు గుర్తు చేసింది. ఇలా చూస్తే, న్యాయాలు కేవలం శాస్త్రీయ ఉదాహరణలు కాదు. అవి మన ఆలోచన, మన అనుభవం, మన భావి జీవితం అంతటా ప్రతిధ్వనించే సూత్రాలు. సాహిత్యంలో న్యాయాలు అనేవి మన మనసు యొక్క తర్కాన్ని, మన తర్కం యొక్క భావాన్ని కలిపే మాధ్యమాలు. సాహిత్యం లో న్యాయాలు ఒక సమీక్షాత్మక అవలో కనం.






**-పురిమళ్ల సునంద**
9441815722

భారతీయ తాత్త్విక సాంప్రదాయంలో "న్యాయం" అనే పదం తర్కానికి, విశ్లేషణకు, మరియు భావసూ త్రాలకు ప్రాథమిక స్థంభం. న్యాయం అనేది కేవలం వాద ప్రతివాదం కోసం మాత్రమే కాదు. అది ఒక ఆలోచన, ఒక భావప్రక్రియను స్పష్టత తో చెప్పే మార్గం. సంస్కృతంలో ఉన్న అనేక న్యాయాలు **"అంకోల బీజ న్యాయం", "భ్రమర కీటక న్యాయం", "ఆత్మాశ్రయ న్యాయం", "క్షీరోదక సంపృక్త న్యాయం"** వంటి వన్నీ శాస్త్రవేత్తలు, కవులు, విమర్శకులు వివిధ సందర్భాల్లో ఉపమానాలుగా ఉపయోగిం చారు.

గాంధర్వ నగర న్యాయం అంటే, ఉన్నట్టుగా కనబడినా వాస్తవంగా లేని దృశ్యం మాయా నగరం వలె. మనం కలలో చూసే నగరంలా ఉంటుంది. గురుశిష్య న్యాయం అంటే, గురువు చెప్పిన మాటలను శిష్యుడు అనుసరిం చాలి అనే భావం. శిష్యుడు స్వంతంగా అర్థం చేసుకోవక, గురువు బోధనపైనే ఆధారపడతాడు. చతుర్వేద అమ్న్యాయం అంటే, నాలుగు వేదాలు అన్నీ ఒకే సత్యాన్ని చెప్పుతున్నాయని సూచించేది వేర్వేరు మార్గాలు అయినా తాత్పర్యం ఒక్కటే అని చూపుతుంది. చందన న్యాయం అంటే, చందనం చెట్టు ఎక్కడ ఉన్నా చల్లదనం ఇస్తుంది మంచివాడి స్వభావం ఎక్కడ ఉన్నా మంచిదే అని చెప్పే దృష్టాంతం. తీర్థ కాక న్యాయం అంటే, కాకి తీర్థం తాగడానికి వచ్చినట్లు బయటివరకు మాత్రమే వస్తుంది కానీ అంతర్ముఖంగా కాదు. పైపైగా మాత్రమే చేసే భక్తి లేదా ప్రయత్నం అని సూచిస్తుంది. దేవతాధికారణ న్యాయం అంటే, దేవతకు సంబంధిం చిన కర్మలు అర్థం చేసుకోకుండా కేవలం ఆచారమాత్రంగా చేయడం అధికారవంతుడైన దేవుని స్థితిని గుర్తించడం అవసరమని సూచిస్తుంది. పతంగ దీప న్యాయం అంటే, చీమ లాగా దీపానికి ఆకర్షితమై దహించు కునే పరిస్థితి ఆకర్షణ వల్ల నాశనం అనేది తాత్పర్యం. పరిశేష న్యాయం అంటే, కొంత భాగం చెప్పినప్పుడు మిగిలిన భాగం స్వయంగా అర్థమవు తుందని భావం. ఇది తార్కిక నిర్ణయానికి సంబంధించిన న్యాయం. హస్తి పద న్యాయం అంటే, ఏనుగు ఒక భాగం చూసి మొత్తం అర్థం చేసుకోవడం అసంపూర్ణ జ్ఞానం ద్వారా తీర్మానం చేయడాన్ని సూచిస్తుంది. హంస క్షీర న్యాయం అంటే, హంస పాలు, నీరు కలిసిన దానిలోంచి పాల ను మాత్రమే తాగుతుంది. మంచి చెడు లోంచి మంచిని మాత్రమే గ్రహించడం అన్న భావం. క్షీరదక సంపృక్త న్యాయం అంటే, పాలు, నీరు కలిసినప్పటికీ వేరు చేయగలగడం సత్యం, అసత్యం కలిసినా వాటిని వేరు చేసి తెలుసుకోవ డం అన్నది భావం.

సమీక్షాత్మకంగా చెప్పాలంటే, న్యాయాల ద్వారా సాహిత్యం ఒక బలమైన తాత్త్విక పునాది పొందు తుంది. భావోద్వేగానికి ఆలోచనాప రమైన దృఢత్వం వస్తుంది. ఒక కవి కేవలం భావం చెప్పడంలోనే కాదు, ఆ భావం వెనుక ఉన్న సత్యాన్ని సూచించడంలోనూ న్యాయాలను ఉపయోగిస్తాడు. ఈ విధంగా న్యాయాలు సాహిత్యంలో భావానికి లాజిక్ జోడిస్తాయి. పురిమెళ్ళ సునంద గారి రచన ఈ దిశలో ఒక విలక్షణమైన ఉదాహరణ. సాహిత్యంలో న్యాయాలు అనే అంశం మనకు ఒక గొప్ప పాఠం నేర్పుతుంది. సాహిత్యం కేవలం మనసు విషయమే కాదు, అది మేధస్సు విషయమూ కాదని, ఈ రెండింటి సత్యసమతుల్యమే అని. భావానికి తర్కం తోడైతే అది సాహిత్యం అవుతుంది. తర్కానికి భావం తోడైతే అది జీవన తత్త్వం అవుతుంది. సాహిత్యంలో పురిమెళ్ళ సునంద చేసిన ఈ గ్రంథ ప్రయోగం, ఈ విషయ ప్రయోగం ఎంతో కొత్తదనం చూపుతుంది. ఎవరికీ తెలియని అంశాల్ని అందిబుచ్చుకుని చక్కని కొత్త విషయాలను తెలియజేసిన సునందకు నా హృదయపూర్వక అభినందనలు.



**–శైలజామిత్ర**
9290900879

**న్యాయాల ద్వారా ఒక వాక్యం, ఒక భావం, లేదా ఒక పరిస్థితి మనసుకు చేరువగా అవుతుంది. తెలుగు సాహిత్యంలో న్యాయాల ప్రాముఖ్యత చాలా విస్తృతమైనది.**


## జీవితయానం

రోజూ వెళ్లే ప్రయాణాలకే హామీ లేకపోతే
జీవితయానానికి ఎలాంటి హామీ ఉంటుంది?
ఎంత సమయం మన చేతిలో ఉందో
ఎవరికి తెలుసు?.
కానీ మనిషి మాత్రం
ఇక్కడ శాశ్వతుడిననే భ్రమతో
అహంకారపు గూటిలో నివసిస్తాడు.
ఆనందం కూడా అతిశయంగా,
కోపం కూడా అగ్నిలా,
అసూయ విషంలా,
స్వార్థం నీడలా వెంటాడుతుంటాయి.
అలా మనమే మన జీవితాన్ని
నరకంగా మలుచుకుంటాం.
వాస్తవానికి
జీవితం మనఃస్పందనల ప్రతిబింబం.
మన దృష్టికోణమే దిశను నిర్ణయిస్తుంది.
అర్థం చేసుకునే విధానం మారితే
ప్రపంచమే మారినట్లవుతుంది.
సానుకూల ఆలోచన
చిన్న దీపమై వెలిగితే
చీకట్లు నెమ్మదిగా వెనక్కు తగ్గుతాయి.
శాంతి మన గుండె తలుపు తట్టుతుంది.
జీవితం చిన్నదే
కానీ కళ మాత్రం దీర్ఘం.
మనమందరం ఈ విశ్వ వేదికపై
తమ తమ పాత్రలు ధరించిన కళాకారులమే.
నిష్ఠతో నటిస్తే
మన ప్రస్థానం అర్థవంతమవుతుంది.
సవాళ్లు వస్తే
వాటిని పారిపోకుండా
నిలబడి ఎదుర్కోవాలి.
ఎందుకంటే
ప్రయాణానికి గమ్యం తెలియకపోయినా
మన నడకలో నిజాయితీ ఉంటే
అదే జీవితం యొక్క విజయం.

**-డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496

## చెల్లెమ్మ కథ

నాన్న లేని నీ జీవితం
మూడేళ్ల పసితనంలోనే
విధి వ్రాసిన నిశ్శబ్ద శోకం.
అల్లారు ముద్దుల ముచ్చటలు లేని
రోజులు
లాలి పాటలేని వెన్నెల రాత్రులు
బాల్యం కాలంలోనే
అనారోగ్యం నీ శరీరాన్ని
నెమ్మదిగా ఖాళీ చేసింది
డబ్బుల కొరత
ప్రతి శ్వాసకూ ప్రశ్న వేసింది.
రోగం ఒక వైపు
అప్పులు మరో వైపు
మధ్యలో నలిగిన మనసు
బతకడాన్నే భారంగా మార్చింది.
చివరికి
మరణమే నీకు ఉపశమనమైంది
ఈ లోకం ఇవ్వలేని శాంతిని
ఆ లోకం ఇచ్చిందేమో.
చెల్లెమ్మానీ జీవితం
బాధలతో రాసిన కథగా
మనసుల్లో
నిలిచిపోయింది...



**-ఎలగొండ రవి**
9848770345

## తాళంచెవి

'ఇల్లు' కన్న తలుపు చిన్నది
'తలుపు' కన్న తాళం చిన్నది
'తాళం' కన్న 'తాళంచెవి' చిన్నది
ఇంటి కంట్రోల్ చిన్న 'కీ'లో ఉన్నది
మన సుదీర్ఘ జీవితాన్ని నిర్ణయించేది..
చిన్న చిన్న తెలివైన కార్యాలే సుమా !.
చెట్టు కన్న కొమ్మలు చిన్నవి
కొమ్మల కన్న ఆకులు చిన్నవి
ఆకుల కన్న గింజలు చిన్నవి
బతకడం కన్న జీవించడం గొప్పది
తీసుకోవడం కన్న ఇవ్వడం గొప్పది
గింజ పగిలి చెట్టై ఎదగడమే గొప్పది !.
స్నేహితులు నానా రకాలు..
ప్రతి ఏటా రాలిపోయే 'ఆకులు'
గాలి వాటానికి విరిగే 'కొమ్మలు'
కంటికి కనబడని లోతైన 'వేర్లు'
చెట్టు ఉనికికి కారణమైన 'గింజలు'
గింజల్లాంటి వాళ్లే కదా ప్రాణ మిత్రులు !
'అనుమానం' ఆనందాన్ని హరిస్తుంది
'దురాశ' దుఃఖ హేతువు అవుతుంది
'నేను' అనే గర్వం ఏకాకిని చేస్తుంది
'షరతుల'తో జీవితం ఓటమిని ఇస్తుంది
'ఈర్ష్య అసూయ' దేహాన్ని చెదలై తింటుంది
'నిష్కల్మష' హృదయం
ప్రశాంతత తెస్తుంది !



**-మధుపాళీ**
9949700037

పుస్తక సమీక్షలు

# తెలుగుతల్లికి కవితాహారతి

ఉయ్యాల పాటలతో లాలిం చి, ఉగ్గుపాలతో మాటలు నేర్పిం చిన తియ్యని తెలుగు భాషకు, తెలుగు తల్లికి శతకోటి ప్రణామా లు సమర్పిస్తూ, తెలుగ మ్మకు పా దాభివందనాలతో, తెలుగు సౌరభాలు' తన కవితా సంపుటి అంకితమిచ్చిన కవి గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్. ఓరి తెలుగోడా, తెలుగులోనే మాట్లాడు, చదువు, వ్రాయు అంటూ తెలుగుజాతి ఎదుర్కొంటున్న దౌర్భాగ్యం పరో క్షంగా నిలదీస్తూ ఉద్యమ పతాక ఎగురవేసారు. ఈ సంపుటిలోని 7 కవితలు, తెలుగు భాషా మాధుర్యం, వైభవం, వైశిష్ట్యం, ప్రగాఢ ప్రేమాభిమానాలు వ్యక్తం చేస్తున్నాయి.

1400పైగా కవి తలు, పద్యాలు, గేయాలు రచిం చిన గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, అందమే ఆనందమని, ఆనందమే జీవిత మకరందమని పూలను, ప్రకృతి అందాలను చూపిస్తూ మనసులు మేల్కొలిపే లక్ష్యంతో సుమ సౌరభాలు, తెలుగు జాతికి జేజేలు కీర్తించే ప్రబోధ కవితలుగా తెలుగు సౌరభాలు ప్రచురింప చేసారు.


తెలుగు భాష, తెలుగు దనం, తెలుగు సంస్కృతి సంప్రదా యం, తెలుగు వైభవ కళకళలా డుతూ కొనసాగాలని ఆశిస్తున్న కవి 'కాంచవోయి నేటి తెలుగు దుస్థితి'లో ఆధునిక నాగరికత తెచ్చిన దురవస్థకు బాధ వ్యక్తం చేస్తూ ప్రాంతీయ తత్వాన్ని ప్రక్కన పెట్టి ఆలోచించవలసినదిగా కోరుతూ మంచి రోజులు రావా లని ఆశాభావంతో ప్రబోధిం చారు. ఓ తెలుగోడి తపన, గోడు, ఓరి తెలుగోడాలో

**"తెలుగుకు తరుగొచ్చింది**
**తెలుగుకు తెగులొచ్చింది**
**తెలుగుకు మరుగొచ్చింది"** అంటూ కవి తపించారు.

తెలుగు వాన్ని మేల్కొనమని, తెలుగును కాపాడమని, తెలుగు కోసం పోరాడమని, తెలుగు ఖ్యాతి నిలుపమని, కవి రాజేంద్రప్రసాద్ అంతా తెలుగుమయంగా తెలుగు తల్లికి నీరాజనం సమర్పించారు.

**"గోదారిలా సాగేటి**
**వేదము నా తెలుగు**
**త్రిష్ణలా సాగేటి**
**కావ్యము నా తెలుగు"** అం టూ తెలుగు తరంగనాదాలు ప్రతిధ్వనింప చేసారు.



**ప్రతులకు:** గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
తండ్రి కోటయ్య, ఇ.నెం.1-19-72/5/204, ప్రశాంత్‌నగర్ ఆక్స్‌టెన్షన్ కాలనీ, ఆశా హాస్పిటర్ ఎదు రుగా, హై టెన్షన్ రోడ్‌డా॥ఏ.ఎస్.రావు నగర్, కాప్రామండలనం. మెడ్చల్ మల్కాజిగిరి జిల్లా -500062
సోల్: 7981616630



**–జయసూర్య**
9440664610

# గ్రీటింగ్స్

(కథ)

సిటీలో న్యూయర్ వేడుకలు జరుగుతున్నాయి, నేను గదిలో ఒంటరిగా ఓ పుస్తకంలో పుస్తకంలాగా, వస్తువులో వస్తువులాగానో చలనం లేని వాడిలా నిశబ్దంగా ఉన్నాను.

నాతో మాట్లాడే వారేలేరు, నేను ఒంటరిని నిన్న మొన్నటి వరకు నాతో తిరిగిన నేస్తాలు చాల మంది ఈ లోకం విడిచి వెళ్ళారు.

ఊరు దాటి వచ్చాకా పక్కనున్న ఊరిలో పరిచయమైన వాళ్ళు కాలక్రమేన పెళ్ళిళ్ళు చేసుకుని కొత్త జీవితంలో కొత్త దారులు వెతుకుంటూ వెళ్ళారు. ఇక్కడా నేను మళ్ళీ ఒంటరినైనాను.

డిశెంబర్ 31 మళ్ళీ జీవితంలో రానట్టు ఒకరి కొకరు ఫోన్ చేసుకోవడం , మందు, బిర్యాని, చికెన్ అంటా, అదేంటో తాగేవాడికి ప్రతి రోజు థర్టిఫస్టే గదా ఈ రోజు స్పెషల్ ఇది మరో సాకువాడికి.

నాకు కనీసం హ్యాపీ న్యూయర్ చెప్పేవాళ్ళు లేక ఎన్నేళ్ళైందో, ఈ జీవితానికి ఓ ప్రేమ పంచేవాళ్ళు లేరు, కనీసం మనసులో భావాలను పంచుకోడానికి కూడా ఓ మనిషి తోడు లేకపోవడం ఎంత దురదుష్టకరం చెప్పండి.

జీవితంలో ప్రతీ పండుగ వచ్చినప్పుడల్లా నా కండ్లలో నీళ్ళు ఊరడమే తప్ప ఎప్పుడు సంతోషం చూసి ఎరగను,రాఖీ పండుగకు వచ్చే చెల్లిని దేవుడు ఎత్తుకెళ్ళి మోసం చేశాడు, ఆ తరువాత తమ్ముడు, నాన్న ఒకరెనుకా ఒకరు ఈ లోకంలోని మనుషులకు దూరంగా ఈ భూదేవి ఒడిలో కలిసి పోయారు,

ఉగాది, సంక్రాంతి , దసర, అన్ని పండుగలే నాకు మాత్రం అవి వేరేలా అనిపించేవి. పచ్చనోట్లతో దూరమైన బంధాల లాగానే అవి కూడా మెల్లగా నాకందనంత దూరం చేసిన దేవుడు కనిపిస్తే నిలదీయాలని ఎన్నిసార్లు అనుకున్నానో.

దూరంగా రోడ్లపై అరుపులు కేకలు బాణసంచాల చప్పుడు.

అదే మా చిన్నప్పుడు.....

"అమ్మా ! నాన్నకు చెప్పవే గ్రీటీంగ్స్ కొనీయమని" బతిమిలాడుతున్నారు తమ్ముడు,చెల్లి.

"అది మన పండుగ కాదు బిడ్డా! మనం ఉగాదికే చెప్పుకోవాలి" అమ్మ బుజ్జగిస్తుంది.

"తెలుసు కాని మా ఫ్రేండ్స్ వేరేలా అనుకుంటారమ్మ ఇప్పటికే నువ్ పిసినారివి అంటూ ఎగతాళి చేస్తుంటారు" బుంగ మూతి పెట్టి అంది చెల్లి.

"మన పరిస్థితులు మనకు తెలుసు వాళ్ళకు తెలియవు కదా బిడ్డా!" అమ్మ సర్ది చెబుతుంది.

"అమ్మ ! ప్లీజ్"

న్యూ ఇయర్ అంటున్నారు గద పిల్లలు ఆ సెల్ఫ్ డబ్బాలో వున్న డబ్బులు తీసి ఇవ్వు శోభ.

"ఆ డబ్బులు పక్కకు ఎందుకు పెట్టామో గుర్తుందా మీకు" కోపంగా అంది అమ్మ.

"పక్కింటి శ్యామలక్క న్యూ ఇయర్ ముగ్గేసింది వాకిట్లో చెల్లెతో పాటు నువ్వు రంగులు వేయండి నేను రఘును పంపి గ్రీటింగ్ కార్డ్స్ తెప్పిస్తాను సరేనా" నాన్న మెల్లగా అన్నాడు.

నేను చాక్ పీస్ తో హ్యాపీ న్యూ ఇయర్ అని ఆర్ట్ వేశాక అందులో రంగులు నింపారు చెల్లే, తమ్ముడు. దానికి అటూ ఇటూ పురి విప్పిన నెమల్లు పైన ఒకటి కింద ఒకటి ముగ్గ వేసింది చెల్లి, రంగులన్ని నింపాక ఊరంత ఎవరెవరు ఏమేం వేశారో చూసి వచ్చాం.

"ఊరందరిలో మనదే బాగుంది గద అన్నయ్య" అంది చెల్లి.

"నిజమే రా! ప్రైజ్ ఇస్తే మనకే వచ్చేది " నవ్వుతూ అన్నాను.

"సంక్రాంతి వుందిగా అన్నయ్య అప్పుడు ట్రై చేద్దాం ప్రైజ్ మిస్ కాకుండా చూసుకుందాం" గంతులేస్తూ అంది.

"నువ్వంటే ప్రైజ్ మనదే చెల్లి, పదా మనకు నాన్న గ్రీటింగ్స్ తెప్పిచ్చిండేమో!" అనుకుంటూ ఇంట్లోకి వెళ్ళే సరికి ఏదో గొడవ జరుగుతుంది.

రామలింగం గతంలో పెట్టుబడికి అప్పు ఇచ్చిండటా, ఇప్పుడు కట్టమని గొడవ, ఇంట్లో పది మంది పెద్ద మనుషులు కూర్చున్నారు. అమ్మ,, నాన్న ఓ మూలన భయంతో మౌనంగా కూర్చున్నారు.

"పంటచ్చాక కడుతాం" అని నాన్న,

"లేదు అప్పు ఇప్పుడు కట్టాల్సిందే" అని అతను.

"నేను ఓ పని చెబుతాను చేయిండ్లి" అప్పు ఇప్పిచ్చిన పక్కింటాయన మెల్లగా అన్నాడు.

వాడు అసలే కుట్ర బాజి ఏం చెబుతాడో అని అమ్మ నాన్న బిక్కు బిక్కు మని ఓ మూలన కూర్చుండి చూస్తున్నారు.

"మోతు గుడ్డం భూమి అమ్మండి" మెల్లగా వాడి మోసపు కుట్రను భయట వేశాడు.

"భూమి అమ్మడం – మనిషి చావడం రెండు ఒకటే" నాన్న కండ్ల నీళ్ళు తీసుకుంటూ అన్నాడు.

"అయినా పంట మీద భూమి ఎవరు కొంటరు?" అమ్మ అంది.

"నేను అమ్మిస్తాను ఇదిగో వీడు మా తమ్ముడు వానికి భూమి లేదు డబ్బులు ఇప్పిస్తాను పంట అయిపోయకా కొలత పెట్టుకుందాం" అన్నాడు పక్కింటాయన.

"భూమి అమ్మడం నాకు ఇష్టం లేదు" నాన్న గట్టిగా మంకు పట్టు బట్టిండు.

పక్కింటాయన నాయనమ్మ తాతయ్యతో మాట్లాడి ఒప్పించిండు.

నాన్న ససేమిరా ఒప్పుకోలేదు.

"అప్పు నేను ఇప్పిచ్చాను నువ్ గట్టనంటే నేను గట్టాల్నా" ఆవేశంగా అన్నాడు పక్కింటాయనా.

"ముందు నా అప్పు తీర్చండి లేకుంటే నేను ఇక్కడ నుండి పోనే పోను" అంటూ మంచంలో నుండి లేచి కింద కూర్చున్నాడు రామలింగం.

నాన్న ఉరి వేసుకుని చస్తానని పగ్గం బట్టుకుని పెద్దమ్మ తల్లి గుడిదిక్కున్న బంజరు భూమి వైపు వెళ్ళాడు.

అమ్మ బోరుమని ఏడుస్తుంది. నాయనమ్మ తాతయ్య చెరో వైపు నుండి నాన్నను ఆపడానికి వెళ్ళారు.

రైతు పంట పండించాలంటే ఇన్ని కష్టాలుంటాయా? అప్పు అంటే ముప్పనే వీళ్ళు అప్పు ఎలా తెచ్చారో నాకు అర్థం అయ్యేది కాదు.

"నువ్ చెల్లేను తమ్ముడిని తీసుకుని స్కూల్ కు వెళ్ళు ఇక్కడ ఏమైనా మేం చూసుకుంటాం" అని అన్నం పెట్టి టిఫిన్ బాక్స్ ఇచ్చింది అత్తయ్య.

"మేం స్కూల్ కు వెళ్ళనే వెళ్ళం, నాన్న వచ్చాక వెళ్తాం" ఏడుస్తూ అన్నాం.

"వద్దు రా చెల్లే, తమ్ముడు భయపడు తాండ్లు అక్కడన్న నెమ్మదిగా కూర్చుంటారు" అంది అత్త.

"నిజమే! కదా అత్తంది ఇక్కడుంటే చెల్లే, తమ్ముడు భయపడతాండ్లు స్కూల్లో అయినా అన్ని మర్చిపోయి కూర్చుంటారు 'మనసులో అనుకుంటూ బాధగానే సైకిల్ పై వాళ్ళను కూర్చుండబెట్టుకుని భయలుదేరాను.

స్కూల్లో అందరు ఒకరి కొకరు స్వీట్స్ తినిపించు కుంటూ గ్రీటింగ్స్ ఇచ్చుకుంటున్నారు. చెల్లి తమ్ముడు ఒకరి మొఖాలు ఒకరు చూసుకుని నావైపు చుశారు.

నేను చాలా సేపు ఆలోచించాను.అందరిలానే చెల్లి, తమ్ముడు మొఖాలల్లో సంతోషం చూడాలి అనుకున్నాను.

బ్యాగులోని తెలుగు బుక్ అట్టలోపల దాచుకున్న డబ్బులు వెతికాను,అందులో ఎప్పుడో నాన్న నోట్ బుక్ కొనుక్కోడానికి ఇచ్చినవి అలానే దాచుకున్నాను, ఇవి ఇప్పుడు వారి సంతోషానికి ఉపయోగపడుతున్నాయి.

సైకిల్ తీసుకుని దగ్గరలో వున్న పోస్ట్ ఆఫీస్ కు వెళ్ళీ కొన్ని పోస్ట్ కార్డ్స్ తీసుకుని మళ్ళీ స్కూల్ కు తిరిగి వచ్చాను, చెల్లికి తమ్ముడికి విషయం చెప్పి క్లాస్ లకు పంపాను.

ఫస్ట్ పిరియేడ్ అయ్యేలోపు నేను స్కెచ్ తో రకరకాల రూపంతో హ్యాపీ న్యూ ఇయర్ అని రాసి చిన్న లోగో గీసి సేవ్ అగ్రికల్చర్ – సేవ్ ఫార్మర్ అని రాసి ఫ్లవర్స్ ,డిజన్స్ తో కూడిన ఫార్మర్ బొమ్మలను గీసి వాళ్ళ చేతికిచ్చాను, కొన్ని సర్ ప్రైజ్ గా అడ్రస్ రాసి పోస్టుబాక్స్ లో వేశాను.

మధ్యాహ్నం లంచ్ బ్రేక్ వరకు చెల్లి, తమ్ముడు ఆ కార్డ్స్ పంచి వారికి వాళ్ళ ఫ్రెండ్స్ ఇచ్చిన గ్రీటింగ్ కార్డులను నాకు చూపించారు. కాని నా మనసులో ఇంటి వద్ద ఏం జరుగుతుందోనన్న ఆందోళన తొలుస్తునే వుంది.

"బాబు శివ నిన్ను ప్రిన్సిపాల్ మేడం రమ్మంటుంది" అటెండర్ వచ్చి చెప్పగానే నేను టీచర్ పర్మిషన్ తీసుకుని వెళ్ళాను.

"హ్యాపీ న్యూ ఇయర్ శివ" ప్రిన్సిపల్ మేడం షేక్ హాండ్ ఇస్తూ చెప్పింది.

ప్రిన్సిపల్ మేడం ఏంటి నన్ను పర్సనల్ గా పిలుచుకుని హాపీ న్యూ ఇయర్ చెప్పడం ఏంటి నాకే కాదు అక్కడ ఆఫీస్ రూంలో కూర్చున్న ఏ టీచర్ కు అర్థం కాలేదు గాని అందరి మొఖాలలో ఓ చిరునవ్వైతే కనిపిస్తుంది.

"సేమ్ టూ యు మేడమ్" ఆశ్చర్యంగా అన్నాను.

ప్రిన్సిపల్ స్టాఫ్ అందరిని పిలవడంతో ఒక్కొక్కరు వచ్చారు అందరు కూర్చున్నాకా నేను గీసిన గ్రీటింగ్స్ ని వాళ్ళ ముందు పెట్టింది.

"అవి చేతితో గీసినట్టుగా లేవు, అచ్చం ప్రింట్ చేసినట్టే వుంది మేడం" అన్నారు.

"అంతేనా? మీరు గమనించింది" ప్రిన్సిపాల్ అనడంతో అందరు మేడం వైపు చుశారు.

ఎవరు చప్పుడు చేయకపోవడంతో ఒక్కో గ్రీటింగ్ లో ఓ ప్రత్యేకతను విడమరిచి చూపించింది ప్రిన్సిపాల్.

నిజమే! ఓ చోట పూలసాగు, మరో చోట మిర్చి, వరి, పత్తి అంటూ రకరకాల పంటలతో వ్యవసాయం చేసే రైతు, చివరకు పంట అమ్మితే మిగిలే పరిస్థితులను ఈ పేయింటింగ్స్ లో మనకు కండ్లకు కట్టినట్టు కనిపించేలా వేశాడు" ప్రిన్సిపాల్ విడమరిచి చెబుతుంటే మిగతా స్టాఫ్ కల్లప్పగించి చూస్తున్నారు.

"సేవ్ ఫార్మర్ – సేవ్ అగ్రికల్చర్ నీ ఆలోచన బాగుంది శివ " ఆర్ట్ టీచర్ అభినందించాడు.

"వ్యవసాయం చేసే రైతులకు ఎన్ని కష్టాలుంటాయో కదా ఓ వైపు అతి వృష్టి –మరో వైపు అనావృష్టి బ్యాంకు ఋణాలు, చివరకు పంట చేతికి వస్తుందో రాదో " సైన్స్ టీచర్ చెబుతూనే తన తండ్రి మరణాన్ని గుర్తు చేసుకుంటూ ఏడ్చింది.

"మేడం! ప్లీజ్ " ఆమె భుజంపై చేయి వేసి ఓదార్చింది ప్రిన్సిపల్.

"మన సైన్స్ టీచర్ వాళ్ళ నాన్న మండలం లోనే ఆదర్శ రైతు, వ్యవసాయాన్ని ప్రేమించాడు, నలుగురికి అన్నం పెట్టాలన్న ఆకాంక్షే తప్ప తన గురించి తానేప్పుడు ఆలోచించుకోలేదు, బతికినంత కాలం రైతుగానే బతకాలనుకున్నాడు. ముగ్గురు పిల్లలను చదివిస్తూనే అనేక కష్టాలకు ఓర్చుకుని చివరకు తనువు చాలించాడు, రైతు ఎప్పుడు రాజే" ప్రిన్సిపాల్ చెబుతుంటే అందరు సుధీర్ఘమైన ఆలోచనలో పడ్డారు.

ఇంటి వద్ద అమ్మ నాన్న పరిస్థితి ఎలా వుందో నాన్న ఇంటికి వచ్చాడో రాలేదో, అప్పు ఇప్పిచ్చిన పక్కింటాయనా ఇచ్చిన రామలింగం ఇద్దరు కూడ బల్కుని వడ్డీకి వడ్డీని అసలు కాగితాలు మారుస్తూ వచ్చారు,గట్టిగా ఏం మాట్లాడలేం ఎవరైనా అంటే తప్పు మనదే అంటారు' మనసులోనే గుర్తు చేసుకుంటుంటే కండ్లనీళ్ళు ఆగలేదు.

"శివా ఏం ఆలోచిస్తున్నావ్" సదానందం సార్ భుజం తట్టాడు.

నేను కండ్ల నీళ్ళు తుడుచుకుని "ఏం లేదు సర్ " అన్నాను.

"శివ 26 జనవరి రోజున రైతు గురించి పిల్లలకే కాదు పెద్దలు అందరికి అర్థమయ్యేలా నీతో ఓ ఫోగ్రాం చేయించాలి అనుకుంటున్నాను, నువ్ స్కిట్ రాస్తావో పేయింట్స్ వేస్తావో నీ ఇష్టం వ్యవసాయం అంటే ఏంటో చిన్న పెద్దలకు క్లియర్ గా అర్థమయ్యేలా చూడు" ప్రిన్సిపాల్ అనౌన్స్ చేసింది.

"ఈ దేశానికి అన్నం పెట్టే రైతు గురించి ప్రత్యేక ఫోగ్రాం పెడతామంటే మేమందరం సహకరిస్తాం మేధం" ఉపాధ్యాయులు అందరు మూకుమ్మడిగా అన్నారు.

"సేవ్ అగ్రికల్చర్ – సేవ్ ఫార్మర్ నీ ఈ నినాధం ఇక్కడే ఆగకూడదు మనందరం కలిసి ముందుకు తీసుకెళ్ధాం" అన్నారు టీచర్స్.

స్కూల్ నుండి ఇంటికి వచ్చేసరికి నాయనమ్మ ఎదురచ్చి "పోస్ట్ మెన్ వెంకట్ నీకేవో లెటర్స్ వచ్చాయని ఇచ్చి వెళ్ళాడు రా " అంటూ తనబ్బీలో దాచినవి తీసి ఇచ్చింది.

మొదట నాయనమ్మ మొఖం చుశాను, తన మొఖం బాదగానే వుంది అంటే ఇంట్లో పక్కింటివాడు రగిలించిన కుంపటి ఇంకా మండుతూనే వుందన్న మాటా మనసులో అనుకుంటూ తను ఇచ్చిన కార్డ్స్ తీసుకున్నాను.

నేను వాటిని ప్రేమగా పట్టుకుని చుశాను, ఊరిలో అందరికి న్యూ ఇయర్ గ్రీటింగ్ కార్డ్సు వచ్చేవి మా ఇంటికే ఎందుకురావు? ఆ ఆలోచన ఎప్పుడు నన్ను వెంటాడేది, పోస్ట్ మెన్ మా ఇల్లుదాటి పక్కిండ్లకు వెళ్ళినప్పుడల్లా మనసు తల్లడిల్లేది, అందుకే ఈ సారి మా అడ్రస్‌తో నేనే గ్రీటింగ్స్ వేసుకున్నాను నరదాగా, ఆ గ్రీటింగ్సే ఇవి అన్న మాట, మన సులో దాచుకుని పలానా వాళ్ళు పంపారని అమ్మతో అబ ద్ధం చెప్పాను.

"అది నిజమైతే బావుండు రా" అంది అమ్మ.

"అమ్మా?" అన్నాను.

"నీ పేయింటింగ్స్ నాకు తెలియవా? నువ్ గీసిన ఈ బొమ్మలలో మనిషి బతకడానికి సరిపడ ధైర్యమిచ్చే మెసేజ్ వున్నది చూడు అది కదా మనిషికి నిజమైన అవసరం, కాస్త వెనుకపడితే గద్దలలా పీక్కుతినే బంధువులున్న ఈ లోకంలో మన పర లేకుండా అందరు బతకాలి అందులో నేనుండాలి ఆ సందేశం ప్రపంచానికి అందించేవాడే మనిషి చక్కగా గీశావు నాయనా" నన్ను దగ్గరకు తీసుకుని అంది అమ్మ.

"హ్యాపీ న్యూ ఇయర్ రా " ముగ్గురిని దగ్గరకు తీసుకుని అంది అమ్మ.

"సేమ్ టూ యు అమ్మ" ముగ్గురం అమ్మను పట్టుకుని అన్నాం.

"నాన్న ఎక్కడ అమ్మా?" ఆందోళన పడుతూనే అన్నాను.

"అదిగో వస్తున్నాడు" అంది బాధను దాచుకుంటూ అమ్మ.

కొట్టంలో ఎడ్లకు మేత వేసి గోలెంలో చేయ్ కడుకుని ఇంట్లోకి వస్తూనే హ్యాపీ న్యూ ఇయర్ రా పిల్లలు" అన్నాడు.

"హ్యాపీ న్యూ ఇయర్ నాన్న" షేక్ హాండ్ ఇస్తూ అన్నాం.

"మార్నింగ్ జరిగిన విషయాలేవి మనసులో పెట్టుకోకుండా చక్కగా చదువుకోండి అలాంటివన్నీ మన జీవితంలో సర్వసాధరణం, నా ఒంట్లో ప్రాణం వున్న వరకు మీ జీవితాన్ని తీర్చి దిద్దడమే నా ధ్యేయం" నాన్న కండ్ల నీళ్ళు దాచుకుంటూనే గర్వంగా అన్నాడు నా చేయి పట్టుకుని.

నాకైతే మన ప్రధానమంత్రి, రాష్ట్రపతి లాంటి గొప్పవాళ్ళ చేయి తగిలితే ఎలా వుంటుందో నాన్న చేయి స్పర్శ ఈ రోజు ఎందుకో అంతకు వేయిరేట్లు ఎక్కువే అనిపించింది, నేను నా అరచేయిని చూసుకుంటూ గదిలోకి వెళ్ళాను.

రైతు అంటే ఈ దేశానికి అన్నం పెట్టేవాడు రైతును రాజు చేసే ప్రభుత్వాలు ఎప్పుడు జనం నాలుకలపై వర్ధిల్లుతాయి, అందుకే సేవ్ అగ్రికల్చర్ – సేవ్ ఫార్మర్ ఈ నినాధం ఆగిపోకూడదు అనుకుంటూ ఆ రోజు ఇంట్లో ఏం జరిగిందో నాయనమ్మను అడిగాను.

"పక్కింటోడు భూమి బేరం పెట్టించాడు వాడి తమ్ముడు ఇచ్చిన డబ్బులతో రామలింగం అప్పు తీర్చారు" నాయనమ్మ అంటుంటే నాకు కాళ్ళ కింద భూమి కదిలినట్టు అయింది, నేను బిగ్గరగా ఏడుస్తూ ఆకాశం వైపు చూస్తూ కింద కూలబడ్డాను.

"భూమి అమ్మడం – ప్రాణం పోవడం ఒక్కటే " అన్న నాన్న మాట చెవులలో మారుమోగుతుంది.

"ఎంత కష్టం వచ్చిన వారి మొఖాలలో కనిపించకుండా మమ్మల్ని కడుపులో పెట్టుకుని ప్రేమగా మాకు భవిష్యత్తును మాత్రమే అందించాలని లేని నవ్వుని పులుముకుని జీవిస్తున్న వాళ్ళకు మేం ఇప్పుడు ఏం ఇచ్చి ఋణం తీర్చుకోవాలి' అనుకుంటుంటే జేబులోని గ్రీటింగ్ కార్డ్స్ కింద పడ్డాయి. హ్యాపీ న్యూ ఇయర్ దాని కింద నేను రాసిన ట్యాగ్ 'సేవ్ ఫార్మర్ – సేవ్ అగ్రికల్చర్' రంగు రంగులతో వేసిన రైతు బతుకు చిత్రం కనిపిస్తుంది.

బయట మంచు పొరలను చీల్చుకుంటూ ఆకాశంలో మెరుపులు టపాకాయల మోతలు మెర్కురి లైట్ల వెలుతురులో హ్యాపీ న్యూ ఇయర్ అన్న కేకలకు నేను గతంలో నుండి వర్తమానంలోకి వచ్చాను.

**రైతు అంటే ఈ దేశానికి అన్నం పెట్టేవాడు రైతును రాజు చేసే ప్రభుత్వాలు ఎప్పుడు జనం నాలుకలపై వర్ధిల్లుతాయి.**



– వజ్జీరు ప్రదీప్
9989562991

## కొత్త దస్తూరి

క్రొత్త అక్షరాలను
వెతుక్కుంటూ
కవితలు
రాయటం ఆలస్యమయింది
క్రొత్తలిపి తయారీలో
కిటికీ దగ్గర పౌర్ణమి
అమ్మ అందాలు
నా దస్తూరిగా మారాక
నాన్న నేరుగా కలం సిరాగా
కదులుతూ...



–డా।। కె.జి.వేణు
9848070084


పుస్తక సమీక్ష

# కనకం "చేసే హస్తాలే" కవిత్వం రాసే చేతులు

"అయితే –

ఆ కవిత్వం కమ్మచ్చు తీరినట్లు మహా నాజూకుగా, జిగి బిగి కలిగి తళుకులీనుతూ, సుగంధం కూడా అబ్బి పరిమళ భరితంగా శాశ్వత విలువలు కలిగి ఉంటుందని రుజువు చేశాడు శ్రీ చలపాక ప్రకాష్. ఏడేళ్ళ తర్వాత వెలువరించిన కవితా సంపుటిలో. ఈ కవితలన్నీ వివిధ పత్రికలలో, వేదికల మీద పరిచయమైనవే. దాదాపు మనం చదివినవే. ఇప్పుడు 2026లో పుస్తక రూపం దాల్చాయి. కనుక నిగ్గు తేరిన, కాలపరీక్షలో నిలిచిన గెలిచిన "హాల్ మార్క్ కవితలు" అనవచ్చు.



–చలపాక ప్రకాష్
9247475975

కవిత్వం చలపాకకు అలవోక. ప్రవాహం. పదాలను వెతుక్కోనక్కరలేదు. వచ్చి కూర్చుంటాయి. అందగిస్తాయి. మందగించవు. భావానికి మెరుగులు దిద్దుతాయి. తమ సత్తా ఏమిటో చూపిస్తాయి. ఈ సంపుటిలో మెరిసిన కవితా రేణువుల అందచందాలను మీకు పరిచయం చేస్తాను. జీవితంలో విశ్రాంతి లేకపోవటం "రెస్ట్ వరెస్ట్గా–ఆస్పత్రి బెడ్ మీద సరికొత్త రోగమై కూర్చుంది." అందుకేకాలం "కొత్తదనాల్లో వేగం తగ్గించి –దారితప్పే అడుగు జాడల్ని సరిచూసుకొని సరి చేసుకోవాలి" అనే హితవు. కంప్యూటర్ ఫేస్ బుక్ అయి చాటింగ్ మోసం మోహాన్నే మాడ్చేసి, రూపాన్ని మార్చేసింది "తస్మాత్ జాగ్రత.." అన్నీ ఫ్రీలే కనుక వాటర్ బాటిల్ స్టోర్‌లో ఇచ్చె సమాజం కోసం ఎదురు చూపు. దీనికి తోడూ జి.స్.టి. రోకటిపోటు సలుపు. కనిపించే ప్రతి దాన్ని కబళించే ప్రపంచీకరణ సూత్రం "వగలాడి తనం" అంటాడు కవి. కవి "తల్లో" పేలు చంద్రుడిలో మచ్చలా తలగోక్కో పెడుతోందని చమత్కారం. **"నావ–కాలం, –నది–జీవితం, సముద్రం– మరణం"** జీవితానికి మూడేముక్కల్లో గొప్ప నిర్వచనం .అపరాధాలు చేస్తూపోతే "నువ్వు కాచిన "టీ" లో గమ్మత్తైన ఏదో ఒక "టి" పడిచస్తావ్. పారాహుషార్ . అపార్ట్ మెంట్ పై నుంచి లేపుతున్న ఆ చెయ్యి – ఆహారపొట్లానికో, టాటా చెప్పటానికో తెలుసుకోలేక పోతున్నాడు. ప్రతి అపార్ట్ మెంటు జీవనది–అందులో మనుషులు నీటిచుక్కలు– తెలిసింది ఎంతైనా తెలియంది కొండైనా–కరిగి పోవాల్సిందే–నేలతల్లిలో 'కల' 'గలిసి పోవాల్సిందే' 'చలపాక వేమన' సూక్తి. గుండెకే కాదు ఒంటి నిండా పడ్డ బొక్కలను చూసి నిట్టూర్పు. "కాకి వదిలిన రాయికి కుండ గుండెలో తడి ఒణుకు" వినూత్న పదబంధం. నిజమైన నేస్తం "వెలుగునిచ్చే స్నేహమనే ఒత్తికి – గుండెగా నిలుస్తాడు" హైబ్రిడ్ వేషమేసు కొచ్చిన–రంగులు మార్చే ప్రేమపూలు "ఏమారుస్తాయి భద్రం బీ కేర్ఫుల్ బ్రదరూ". యువ

**కవిత్వం చలపాకకు అలవోక. ప్రవాహం. పదాలను వెతుక్కోనక్కరలేదు. వచ్చి కూర్చుంటాయి. అందగిస్తాయి.. మందగించవు.**

కవుల గుండె చప్పుడు, ఆదర్శం మార్గదర్శి అద్దేపల్లి రామమోహన రావు –పల్లె పల్లె మర్రి చెట్టు రూపంలో కలగలిసిన– సాహిత్య రూపం "ప్రకాశ"వంతమైన చలపాక నిర్వచనం."అక్షర కంకణంతో" 'స్టెంట్' పడితే కాని అక్షరం బతికి బట్టకట్ట లేదేమోనని నిర్వేదం. "కన్నీరు, ఉన్నవాడి దరి చేరదు –పేదోడి కంటి రెప్పల్లో నేస్తంగా ఒదిగి ఉంటుందట" తన్ను ఏకాకిని చేసి తుర్రుమన్నది జోరీగ –"కపిత్వం కాకిగోల భరించలేక"–ఆలోచన తళుక్కున మెరిసినప్పుడు, కాగితాన్నే మనసుగా చేసుకొని, ఆలోచనే కలంగా పూసుకొని కవిత్వమై కలసిపోవాలని, "సూర్యోదయ" (యు మిన్ జపాన్) దేశంగా అవతరించాలని ఉంటుంది చలపాక చేతులకు. "ఫేస్ బుక్ ఫ్రెండ్స్ లుక్" అని తెలిసింది. మొదట లైట్ తీసుకున్నా, ఆ తర్వాత "నా రూప భావం నీలో పరకాయ ప్రవేశం" అని ఊహాత్మకంగా, వ్యూహాత్మకంగా అంటాడు కవి. కులానికి రిజర్వేషన్ ఉన్నా సుఖ నిద్రకు జనరల్ "కూపే" లో రిజర్వేషన్ ఉండదట. ఇదో అనుభవం. రెండు సిమ్‌లున్నా, ప్రతివాడి సెల్ "రెండు జీవిత కాలాల విముక్తి దొరకని ఖైదీయే" అని "సెల్ హల్ చల్" గురించి నిజం చెప్పాడు . "మరక కూడా మంచిదే" అన్నట్లు –మైమరపూ ఒక వరమే. ఎన్నో సంఘటనల్ని సమాధి చేసి గుండె గాయం కాకుండా మందుపూస్తుంది. 'ప్రాణం లేకుండా తానుండి ఆమె లేకపోవటమే విడిపోవట'. గతకాలంలో తచ్చాడిన పాదముద్రలన్నా జ్ఞాపకంగా బంధించి ఉంచాలని "చిన్నిచిన్ని ఆశ" ఈ ఆవేశపరుడికి. ప్రేమమైన మనిషి హృదయం బతికి ఉన్నప్పుడు గాయాలమయం పోయాక గేయాల, మయం, ఫ్లెక్సీలమయం కూడా బాబూ." తోటి వారిని ప్రేమించే ముందు.. మన గుండెల్ని తడుముకొంటు..మనసారా ప్రేమగా హత్తుకో" అని ఈ 'హార్ట్ ఆర్ట్' "స్పెషలిస్ట్ చిట్కా" కాలం తెలీకుండా నిద్ర కాస్తూ – కళ్ళు వాస్తూ సెల్ బందీలపై జాలి ఎగతాళి.

– విజయం హర్షమై కురిసిన వేళ–వోటమి శోకిస్తూ పోవటమే తన విజయానికి కూటమి "సభ్య సమాజంలో మౌనం మరగరాదు, అక్షరాభిమానం కరగక పోవటమే నవ్వత్వం "కవిగారికో చిన్న డౌటు.." అన్నిటికి వచ్చే ముసలితనం –కాలానికి రాదెందు చేత", తానుకున్న కల మన "వడి"లో ప్రత్యక్షమైనందుకు "ఈ ముసలికవికి దక్కిన అదృష్టం". ఉగాది అంటే "ఏడాది మొత్తం గుర్తు చేసే రోజు" అనే భావన రావాలని కవి ఆశ. అదే అందరి శ్వాస కావాలి కదా. "తాను ఎక్కడికీ పోలేదని..తనను తననుగా ప్రేమించే హృదయ జ్ఞాపకాలలో "శాశ్వతంగా ఉన్నానని చిరునామా చెప్పాడు కవి. "కవిత్వం" "కవి" తత్వాన్నిబోధించే .. విశాలభావజాల గాలం" ఇది మంచి కోటబుల్ కోట్..మట్టిని పూజించటమేకాదు ..మట్టి పరిమళాన్ని ఆఘ్రాణించటమే ప్రకృతి వైద్యం. మన ఉనికిని గుర్తు పట్టే సమాధికి మూలం మట్టి మాత్రమె "అని" మిట్టీ మె సోనా" ఉందన్నారు. మట్టి మనిషిలాగా మానవతావాది అయిన ఈ కవికి –యుద్ధం కోరని దేశం, ప్రపంచ మానవ శ్రేయస్సే" మరీ మరీ ఇష్టం. కొత్త చిగుళ్ళ తొడుగుతున్నప్పుడు–భూమి పగలబడి నవ్వుతూ, పగుళ్ళు బారుతుందట "గొప్ప ఇమేజరీ. పెద్ద చిన్నా బుల్లి తెరలతో పోటీ పడి చిట్టి తెర" విజేతయై విజయదరహాసం ఒలకబోసింది .కడవంత గుమ్మడికాయ కత్తి పీటకు లోకువ అన్నట్లు .. మీసాలు మెలేసే పెద్ద పెద్ద స్పెషలిస్ట్ డాక్టర్లు అయినా–మృత్యువు అక్కున చేరి సేద తీరాల్సిందే ఇది జీవిత నగ్న సత్యం. "మూడు తలల పాము లాటలు" ఆడే మాధుల వికృత వింత ఆటలలో ఎందరు బలైపోతున్నారోనని కవి హృదయం ద్రవించి –కాలమే తెలుస్తుందని "నిట్టూర్చాడు ."నిజం నిప్పు –ఇజం పైకప్పు , మేకప్పు "స్వేచ్ఛ బలైపోతుంటే–బందీ కబంధ హస్తాల నుంచి విముక్తి కోసం .. కొత్తకోరికల పరకాయ ప్రవేశం చేయాల్సిందే "తప్పదు అన్నారు కవి. అక్షరం అక్షరా భ్యాసం చేస్తోందట – మరింత మెరుగులు దిద్దుకోవటానికి". "ఆకలిది దేహ నిదా–ఉచితాలు' "ఉచితానుచితాలు" చూడకుండా ఇచ్చి పారేస్తుంటే సోమరమ్మ, బద్ధకిష్టయ్యలు తామర తంపరగా తయారౌతున్నారు."బాల్యానికి ఎదగాలనే తొందరే, జీవితపు ఆటల్లో గెలవాలని ఆరాటమే" దీని తస్సాదియ్యా..


– ఒంట్లో షుగర్ బలీయమైతే – చప్పదనమే..బహుమతి. వాడి వోడిపోతున్న దేహానికి నేలతల్లి ఆసరా గొప్పకానుక. గుర్తుపట్టే ఒక్క దేహమైనా ప్లాట్ ఫాంపై కనిపించక "చెల్లని నోట్ల కట్టలా శిలా విగ్రహం"గా కనిపించింది కవికి." సాయంత్రం వాన సేద దీర్చే స్నేహితుడయ్యాడు 'ప్రేమించి లేచిపోయినోళ్ళకు అమ్మా నాన్నల ప్రేమ కనిపించలేదా –వెయ్యి డాలర్ల ప్రశ్న." చెట్లు నరికిన పాపానికి ముక్కుకు 'ప్రాణవాయువు" సిలిండర్ కట్టుకోవటమే గొప్ప శిక్ష అయింది .

– తర్వాత కవితలన్నీ 'కరోనా' కవితలే. మనం దాదాపు చదివినవే. బాధపడి కన్నీరు కార్చినవే. కొన్ని హైలైట్స్ –కరోనా కాటుకు పిట్టల్లా రాలిపోతున్న వారి యోగక్షేమాలు కూడా తెలుసు కోలేని నరకం. ఇప్పుడు ఐశ్వర్యం కంటే ఆరోగ్యం ముఖ్యం. ప్రపంచం అంతా ఆకీలుబొమ్మ చేతిలో బందీ అది" ధ్రుత రాష్ట్ర కౌగిలి "చిక్కుకోటం తప్ప విడిపించుకోలేనిది. ఒకరకం గా మానవత్వపు కళ్ళు తెరిపించిన కాలమది . మనిషి మనిషిని ముట్టుకొంటే కరోనా షాక్ ".అంటరాని తనం వెలివాడ ఇప్పుడు ప్రతి ఇంట్లోనూ కాపురం పెట్టింది .ఇలాగైనా మనుషులకు ఇంట్లో ఉంటూ కాస్త విశ్రాంతి శారీరకం గా మానసికంగా. అందుకే ఇది "పోయే కాలం.అంటే ప్రాణం పోయే కాలం అన్నమాట."ప్రాణం ఖరీదు కోట్ల"లో. ప్రకృతి కాలుష్యంతో పాటు భాషామతల్లినీ కాలుష్యపరుస్తున్న తీరు భయానకం బాధాకరం. ప్రపంచ మానవుల్ని ఏకం చేసిన మహా మాయ రోగం –'తడిసిన మానవ మేధస్సును కడిగి–తుడిచే కొత్తచేతిరుమాలు' 'జాతస్య మరణం ధ్రువం' అనే పాతసామెతకు కొత్త నిర్వచనం కరోనా. సూర్యుడు క్వారంటైన్ నుంచి బయటపడ్డ రోగిలా కనిపించాడు .దీనిపై యుద్ధం "కోల్పోయిన ఒక జీవిత కాలానిది". 'గడ్డాలూ మీసాలు పెంచే వినూత్నఫాషన్ ఉరి కొయ్యకు ఋషుల పరువును ఉరితీసి చంపాలి' అక్కర్లేదేమో వాళ్ళే శపిస్తారు భయ్యా.

–ప్రతి నమస్కారం చేయని వాడు బతికున్నాచచ్చినట్లే – "ప్రాణం మనం చాచిన చేతుల్లో, బదులిచ్చే సంస్కారంలోనే ఉంది" సువర్ణాక్షర లిఖితమైన మాట లివి. అ సత్యం పువ్వు ఎప్పటికైనా నేలరాలి –మట్టిలో సత్యంగా కల వాల్సిందే. బాధ పడ్డ నీ కన్నీరు–నా కంటి వెలుగులోకి–చేరడం నేనేకాదు నువ్వూ చూడకపోవచ్చు. ఇది సత్యం నిరంతర సత్యం.

–ఇంటికి తాళం మాత్రమే కాదు, అమూల్యాలన్నీ కాపాడే తాళం భార్య . దాంతో పెట్టు కొంటే నీ పరువు బస్టాండ్. కాలమెప్పుడూ మొఖం వాచినట్లు "పాత ముఖాలను తీసి కొత్తము ఖాలను తగిలిస్తూ" ఉంటాది. ట్రంపు కంపులోంచి బయట పడి సత్తా చూపని ఎన్.ఆర్.ఐ.లకు సవాల్ విసిరిన అసలైన "భారతీ యుడు" మనకవి. "అసంపూర్ణ వల లాంటి జీవితాన్ని కంటూ ఉండటమే భయంకర కల".

–చివరగా "ఆలి మెడలో బంగారపు తాళికూడా లేని – స్వర్ణ కారుల బతుకులలో కాం తులే లేవు "స్వర్ణం" లేని "కారు"లయ్యారు "కారు చౌక" జీవులయ్యారు. అయినా, ఎవరూ గుర్తించకున్నా–"ప్రతి ఒంటిపై అందగించే నగలో సుత్తి దెబ్బలకు తట్టుకొని, మెరిసిన, తళుకులో, మెరుపులో మనం ఉన్నాం భయ్యా" అని ఓదారుస్తాడు. ఈను"వర్ణ" కవీ, స్వర్ణకారుడు అయిన చల పాక ప్రకాష్. ఆయన మేధోజనిత మైన ఈ సంపుటి నిజంగా స్వచ్ఛమైన కాంతులీ నుతోంది ఆయన మన స్సులా, వ్యక్తి త్వంలా, ప్రవర్తనలా.



–గబ్బిట దుర్గాప్రసాద్
సెల్:99890 66375

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1720వ రోజు 'ప్రకృతి అందాలు' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'ప్రకృతి అందాలు' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**

అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839

## సృష్టిలో కమ్మనిది

పదహారణాల తెలుగుదనంతో
పచ్చచీర కట్టుకున్న ముత్తైదువ
పట్టుచీరల సప్తవర్ణ శోభితంలా
పైటవేసుకున్న పడుచుపిల్ల.
గలగల సెలయేరుల శోభితం
వాగువంకల వయ్యారాలు
ఊటబావుల నీరందం
నీటి చెలిమల కనువిందు
అల్లంత దూరాన అమరిన
ఎత్తైన కొండల సమాహారం
ఆ వంకనే హృయలు పోతున్న
లోతైన లోయల మనోహరం.
గోధూళివేళ కుంచెకందని
సజీవ చిత్రమేదో
ఆకాశ కాన్వాసుపై
అలవోకగా రూపుదిద్దుకుని
అందాలను ఒలకబోస్తూంది.
నిశీధి సంధ్య వేళ నిశ్శబ్ద
నింగి వేదికపై నిర్మలమైన
రాతిరి పాడుతున్న జోలపాట
మనోల్లాసమై
గుండెకు హత్తుకున్నది.
సృష్టిలో కమ్మనిదై
మన అవసరాలన్నీ
తీర్చుతూ జీవరాశుల మనుగడకు
ముందడుగులు నేర్పి అనుక్షణం
ఆరాటపడే ప్రకృతిని మనం
కాపాడుకుందాం.

– నగునూరి రాజన్న

## భగవంతుడిచ్చిన వరాలు

అలా అలా అలవోకగా
చూస్తూ చూస్తూ ఉండగానే
అంబరమంతటా పరచుకుని
హృదయాకాశాన్ని సింగిడి రంగులతో
రాగరంజితం చేసే ఉభయసంధ్యల
సౌందర్య లహరులు.
కొండకోనల్లో పుట్టి
జలజలమంటూ గలగల ప్రవహిస్తూ
హృదయనాదంతో శ్రుతికలిపే
జతకలిసే గంగాతరంగ
స్వర ఝరులు.
నిరంతరం ఉన్నత స్థాయికి
చేరడానికి యత్నిస్తూ
మన జీవితాలకు
నిత్యనూతన భాష్యాలు చెప్పే
సాగర తరంగాలు.
పుడమి నాలుగు చెరగులా
మన మనో మందిరాలలో
సంతస పరిమళాలు వెదజల్లే
అగణిత వర్ణాల కుసుమాలు.
అనవరతం మన మిత్రులై
కాపాడే గిరులు, వనాలు
ఋతువుల నిలువుటద్దాలై
పలకరించే తరువులు.
భగవంతుడిచ్చిన
ప్రకృతిరూప వరప్రసాదాలు
శుభంకరముగా నిలుపుకొని
తరించడమో
ప్రళయంకరములుగా చేసుకుని
శిక్షలు భరించడమో
మన చేతుల్లోనే, చేతల్లోనే.

-ముద్దు వెంకటలక్ష్మి

## అమ్మతనపు ప్రతిబింబం

మబ్బుల దుప్పటిని తొలగించి
తొంగిచూసే ఇనబింబం
నిద్రనుంచి అప్పుడే మేల్కొన్నట్లుగా
అరవిరిసిన సుమాలు!.
కళకళలాడే
నిండుముత్తైదు వదనాల్లా
పచ్చని తరువులు
శుకపికముల కలరవములతో
కనువిందగు
అరుణోదయ శోభ!.
జలజల జాలువారే
జలపాతాల మృదంగధ్వనులు
గలగల నాదాల
నదులు, సెలయేళ్ళ
తరంగ ఝరులు
వర్షంలో తడిసిన గిరులు, లోయల
మనోహర సోయగం
ఆరబెట్టుకుంటున్న
కురులపై నిలిచినట్టు
ఆకులపై నిలిచిన నీటిబిందువులు!.
నిత్యము కాంచినా నిత్యనూతనమే
ప్రకృతి దర్శనం
దేహానికి మనసుకు హాయిని
చైతన్యాన్ని కలిగిస్తూ!.
అందమైన ప్రకృతి
మనకు బోధించే పాఠాలెన్నో!.
అంతరాలు పాటించక
అందరికీ
సమంగా పంచుతూ
ఆవిరైన నీటినే
స్వచ్ఛమైన వర్షంగా మారుస్తూ
ఇవ్వడమే తప్ప తీసుకోక
పరోపకారాన్ని చాటుతూ!.
దోసెడు నీటితో గంపెడు
లాభాలనిచ్చే తరువు
మొదలంటా నరికితే మోడైనా
మళ్ళీ చిగురిస్తూ!.
కీడెంత తలపెట్టినా అంతులేని
సహనం వహిస్తూ
ప్రేమమయి సహనశీలి
అమృతమూర్తి అమ్మ
ప్రతిబింబంలా!.
అవసరాలకే తప్ప అత్యాశకు
వినియోగించకు మానవా
కలుషితం కానీయక ప్రకృతిని
పదిలంగా కాపాడవా!.

-చంద్రకళ దీకొండ

## అంతంకాదు

ప్రకృతి అంతంకాదది- అనంతం
మాటలకందని అందం
విన్పించని రాగాలు
ప్రకృతి అందాలు
దైవం ఆకృతి కన్పించు
వికృతి కానీక సహకరించు మనిషీ!.
క్షణంక్షణం అనుక్షణం మారుతూ
జీవులకి జోలపాడుతూ
రాత్రి అందాలు
మేలుకొలుపు కువకువలతో
కొత్త సోయగాలు.
వేదకాలం మొదలు
ఆదికావ్యందాకా
పరమ ఋషులకు
తాపసులకు
కాళిదాసాది మహాకవులకు
స్ఫూర్తిదాత
అంతర్దృష్టితో చూసే
అదృష్టం కొందరికే
బాహ్య లౌకిక దృష్టికి
కొండలు కోనలు
బండలు చెట్లు పుట్టలు.
సకల చరాచరాన్ని
సమదృష్టితో వీక్షించు
దైవం చేతిలోని కుంచె
క్షణ క్షణం మారుస్తుంది
ప్రకృతి అందాల్ని
పంచుతుంది సుగంధాల్ని.
ఓమనిషీ!
నీవు అశాశ్వతం!
నాఅందాల్ని చిదమకు
నాశరీరాంగాల్ని
ముక్కలు ముక్కలు చేసి
క్రూరంగా నవ్వకు
జలప్రళయాలు, తుఫాన్లు,
భూకంపాలకి
కారణం నీవే!
నరకాసురుడివై
భూమాతను హింసిస్తే
నేను కాళీమాతనై తుదముట్టిస్తా
అందాన్ని ఆస్వాదించు
తేనెటీగ, తూనీగ లాగా
ప్రకృతి అందాలు చూస్తూ
నేత్రాల్తో గ్రోలుతూ
వర్ణించు కమ్మని గాత్రాలతో!.

-ఎ.రాజ్యశ్రీ

## ప్రకృతి అందాలే మన జీవనం

ప్రకృతి స్త్రీ స్వరూపం
ఆమె అందాలే
పట్టుపీతాంబరాలు
రాయైనా రప్పైనా
కొండైనా లోయైనా
నదైనా సంద్రమైనా
చెట్టైనా మొక్కైనా
గాలైనా, వానైనా
పుట్టైనా, గుట్టైనా
వెలుతురైనా చీకటైనా
ధ్వనైనా మౌనమైనా
ప్రకృతే ప్రకృతి
మనందరం ఆమె సంతతి .
ఆస్వాదించాలే కాని
అందాలు చిందిస్తూనే ఉంటుంది,
ప్రకృతికి వయస్సు రాదు
సదా యవ్వన శోభల విరాజిల్లు.
ప్రకృతి వైపరీత్యం అని దూషిస్తాం
సబబు కాదది
మన సభ్యతలో లోపం
సభ్యతగా వ్యవహరిస్తే
ప్రకృతి అందాలు
సింగార శృంగారాలు
ఆలింగనాల చుంబన
కితకితల ఆనందాలు.
మన వికృత చేష్టలతో
ప్రకృతి అందాలు ధ్వంసం చేస్తుంటే
ఆ అందాలే మన పాలిట
అవుతాయి గుండాలు
రోదన బాధలు.
అందాన్ని ఆరాధించాలి
అప్పుడే ఆనందాలు
అందాలను విరోధిస్తే
ఇక్కట్ల పాలు.

-రాజప్ప

## నేత్రోత్సవం

ప్రకృతి
మన సుకృతి పండి
నిండినది
జగమెల్ల అణువణువున
చూడు ప్రియతమా!.
చెట్టు చిగురులో
చిగురులోని
పిందెలో పండులో
నిండుగా ఉండెడు
సహజ సౌందర్య శోభ
ప్రకృతి ఒలికించే అందాల
విందులే కదా.
సీతాకోకచిలుక
చిందించే చిక్కని రంగుల
సౌందర్యపు జల్లు
పచ్చని చిలుకకు
ఎర్రని ముక్కు
ఎంత అందమో!.
కాలు భూమిపై ఆనక
పరుగులెత్తే లేడిని చూడాలి
చూడముచ్చటే గదా!.
నాలుగు గోడల మధ్య నలగకు
ఉన్నాయి బయట
అందాల బృందావనాలు
కశ్మీర్ లో కన్నులపండువు
హిమవన్నగ శ్వేతవర్ణఅందాలు
సంద్రాల సందడులు
చరిత్ర చిహ్నాలు
కట్టడాల కంచుకోటలు.
అడవి అందాల ప్రతిబింబాలు
అమాయక జీవుల
అధర దరహాసాలు
అద్భుత లోకం రమ్మంటున్నది
ప్రకృతి సుందరాకృతి చూడు.

-డా.సి.వసుంధర

## రక్షిద్దాం

పచ్చని పర్వతాల కనువిందులు
పరవశపు పక్షుల పాటలు
పూల పరిమళపు ప్రవాహాలు
ఉషోదయ ఉదయ కిరణాల స్పర్శలు.
మంచు ముత్యాల ధగధగలు
పచ్చని పంటపొలాల అందాలు
పల్లెప్రజల జానపద గీతాలు
నదుల జల ప్రవాహ నినాదాలు.
మేఘాల మెరుపుల విరుపులు
వాన చినుకుల చైతన్య రాగాలు
ఇంద్రధనుస్సుల
రంగుల మనోహరాలు
అడవుల అమాయక ఆహ్లాదాలు.
చెట్ల చల్లని ఛాయల సుఖాలు
కోయిలల కుహూకుహూ రాగాలు
ఆహా!
ఇవన్నీ మనసును మురిపించే
మధురమైన సౌఖ్యానుభూతులు.
అందుకే- ప్రకృతిని ప్రేమిద్దాం
ప్రకృతిని రక్షిద్దాం.

-నాగరాజు చుండూరి

## పచ్చని పరువళ్ళ తెలంగాణ

ఓ తెలంగాణా తల్లీ!
నీ ప్రకృతి కీర్తి చిరస్థాయి
నీ ఒడిలో
పచ్చని పరవళ్లు పొంగే
పరిమళంలో
గల గల గోదారి పరుగులతో
కృష్ణమ్మ తరంగాల అలలతో
దక్షిణ దిక్కున ఠీవిగా
విరాజిల్లే తెలంగాణ.
పల్లెల పలుకుల్లో
పరిమళించే పసిడి నేల
పర్వత శిఖరాలపై
పచ్చని పట్టు చీర కప్పుకున్న
ప్రకృతి తల్లి
కవిత్వం జాలువారుతుంది
గాలిలో గుసగుసలాడుతుంది,
గోదావరి గలగలలలో
గాథలు జాలువారుతాయి.
ఆదిలాబాద్ అడవులు
ఆత్మస్వరాలు వినిపిస్తే,
పక్షుల పలుకుల్లో
పల్లవి పుడుతుంది
కోయిలల కూయిలిలో
వసంతం విరుస్తుంది
కృష్ణమ్మ తన కడలిలో
కరుణగా కౌగిలించుకుని
నేలని నిమురుతుంది.
గోదావరి గర్భంలో
గంభీర గానం వినిపిస్తే
భూమి గుండె చప్పుళ్లు సైతం
లయబద్ధమవుతాయి.
బాసర సరస్వతి
ఆశీర్వాదాల వలయంలో
అక్షరాలు అంకురిస్తాయి
వేములవాడ గర్భగుడిలో
ఘంటానాదం మోగితే
మనసు
మల్లెల సువాసనై మారుతుంది.
యాదాద్రి గిరిశిఖరాలు
ఉదయారుణ కిరణాల్లో
బంగారు బొమ్మల్లా మెరవగా
భద్రాచలం భక్తిరసంలో తేలిపోతుంది.
రామప్ప సరస్సు తరంగాల్లో
కాలం తన ప్రతిబింబం
చూసుకుంటుంది.
కాకతీయ కళాతరంగాలు
రాతిలో రాగాలై నిలిచాయి.
వారంగల్ కోట గోడలు
చరిత్రకు చాటుగా
వీరగాథలు విరబూస్తాయి.
బతుకమ్మ పండుగలో
పూల పరిమళం
పల్లెల పొలిమేరల్లో పరవశిస్తుంది
బోనాల జాతరలో
ఊరంతా ఉత్సాహం ఉప్పొంగుతుంది.
సంక్రాంతి సూర్యోదయంలో
గంగిరెద్దుల గంటలు
సంతోష స్వరాలై మార్మోగుతాయి.
వానాకాల మేఘాల ముద్దులో
మొక్కలు మొలకెత్తే ప్రతి క్షణం
ఇక్కడ జీవన గీతమే.
పొలాలపై
పచ్చని పట్టు పరుచుకున్నప్పుడు
రైతు చెమట చుక్కలు
ముత్యాలై మెరుస్తాయి
సిరిసిల్ల నూలు నేసే తంతువుల్లో
సంప్రదాయాలు సాగుతుంటే,
నిజామాబాద్ గాలుల్లో
జాజి వాసనలు జారుతాయి.
ఈ నేలని కేవలం
నేలగా చూడకండి
ఇది మన ఊపిరి
మన ఊసు, మన ఊయల
చెట్లను కాపాడండి
చెరువులను నిలుపండి
నదులను నమ్మకంగా
నడిపించండి.
ప్రకృతిని ప్రేమిస్తే
ప్రకాశించే ప్రగతి
మన పాదాల వెంట నడుస్తుంది.
తెలంగాణ ప్రకృతి అందాలు
కేవలం కంటికి కనువిందు కాదు
మనసుకు మధురానుభూతి
జాతికి జీవనాధారం
భవిష్యత్తుకి భద్రమైన బాట.

-గుండవరం కొండల్ రావు



-డా॥రావి రంగారావు
9247581825

**ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా. రావి రంగారావు 2024 జనవరి నుంచి వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.**

**ఈ వారం నిర్వహించిన కథల వర్క్ షాపులో రెండు కథలను ఎంపిక చేయటం జరిగింది.**

## చతుర్ముఖం

"ఇదిగో బోసూ, రేపు స్వాంత్ర్య దినోత్సవం, పొద్దున్నే పోలీస్ గ్రౌండ్స్ లో జండా వందనం" అని చెప్పిన మంత్రి గారి మాటలు గుర్తుకొచ్చి ఆగస్టు 15 న పొద్దున్నే డ్యూటీలోకి వెళ్ళి పోయాడు బోసు.

మంత్రిగారితో కూడా పి. ఏ. హోదాలో ఆయన కారులో వెళ్తుంటే, ఆ ప్రోటోకాల్ మర్యాదలు చాలా బాగా అని పించాయి బోస్ కి..

జండా వందనం తరువాత మంత్రి గారి స్పీచ్ మొదలైంది. ఆగస్టు 15 అనేది ఒక పవిత్ర మైన పండుగ రోజు అని, ఈ సందర్భం గా ప్రజా సేవకు పునరంకితం అవుతున్నానని సాగు నీటి ప్రాజెక్టులు అన్నీ ఆరు నెలల్లో పూర్తి చేస్తానని, గుంతలు పడి ప్రమాదంగా మారిన రోడ్లన్నీ రెండు నెలలలో కొత్తగా వేయిస్తానని, డిగ్రీ చదివిన వారికి నిరుద్యోగ భృతి అందిస్తానని... ఇలా ఎన్నో వాగ్దానాలు చేసి ఇదిగో ఇప్పుడే మీ అందరి ముందు నా సెక్రటరీకి ఆర్డర్ వేస్తున్నాను" అంటూ ఆవేశంగా అనేశాడు చతుర్ముఖం..

నిజంగా ప్రజలకు మంచి పనులు చేసే అవ కాశం తనకు కలిగిందని సంబరపడిపోయాడు బోసు.

సాగు నీటి ప్రాజెక్టు కాంట్రాక్టర్ తో మాట్లాడి యాక్షన్ ప్లాన్ తయారు చేయించి మంత్రిగారి టేబుల్ మీద ఉంచాడు.

మంత్రిగారు అది చూడగానే కాంట్రాక్టర్ కి ఫోన్ చేసి "ఎవరయ్యా మీకు చెప్పింది? ఇప్పటికే ఇలా పెద్ద ప్రాజెక్ట్ ఒకటి కట్టించి కొన్ని రోజులు నీళ్ళు ఇచ్చిన పిదప కుంగిపోయిన పిల్లర్ల ను చూపి మన పక్క స్టేట్లో ఎక్స్- సీఎం, మీద క్రిమినల్ కేస్ లెట్టారు. అందుకని మీరు జాగ్ర త్తగా, క్వాలిటీ చూసుకుంటూ ప్రాజెక్ట్ కట్టండి" అని చెప్పాడు.

"ఇదిగో బోసూ.... ఇప్పుడే ప్రాజెక్ట్ కంప్లీట్ చేస్తే జనాలకు నీళ్లొస్తాయి సరే , మనకు వచ్చే ఉపయోగం ఏంటి? రెండు మూడు సంవత్స రాలైనా సాగదీస్తే, పెరిగిన కాస్టులో మన పర్సంటేజ్ లు కలిపి ఫైల్ ను పైకి పంపొచ్చు" అన్నాడు.

ఇది విని బోసు సైలెంట్ అయిపోయాడు.

" రోడ్లకు కూడా ఫండ్ ఎంత కావాలో ఎస్టిమేట్ పంపమని చెప్పానండి" అని ఫైలు అందించాడు,

"నువ్వు నాకు చెప్పకుండా ఇలాంటి పనులు చేయబోకు. జనాలు కొన్ని నెలలన్నా గుంటల్లో ప్రయాణించి ఇబ్బందులు పడి ఒకటీ రెండూ యాక్సిడెంట్లు అవీ జరిగి, మన దగ్గరకు ఒక రిప్రజెంటేషన్ తెస్తారు. అప్పుడు చూద్దాం"... క్లాస్ పీకాడు చతుర్ముఖం.

"మరి డిగ్రీ చదివిన వారి విద్యార్థుల లిస్ట్ తెప్పించ మంటారా, నిరుద్యోగ భృతి అన్నారు కదా" అన్నాడు పి. ఏ.

"అవునయ్యా , బాగా గుర్తు చేశావు, అది చేసేద్దాం..పీజీ చేసినవారి లిస్ట్ తెప్పించు,అన్నాడు చతుర్ముఖం.

"అదేంటి సార్... పీజీలు చేసిన వాళ్లు ఎంతోమంది ఉండరు గదా" అన్నాడు బోసు.

"జనాలు ఇన్ని పట్టించుకోరయ్యా, చదువుకున్న పిల్లోళ్లకు భృతి ఇస్తున్నాం.అని చెప్పుకుంటే చాలు ఇప్పటికి".. ప్రతి పక్షాలు అడిగారనుకో

"ఇస్తున్నాం కదా... కళ్ళు కాకు లెత్తుకెళ్లాయా" అని కొన్ని బూతులు జోడించి ఎదురు దాడి చేస్తాం.

వీళ్ల నోట్లో డ్రైనేజీ మనకెందుకులే అని వాళ్ళు ఇక మాట్లాడరు" అన్నాడు చతుర్ముఖం..

"మరి డిగ్రీ పిల్లలు కొశ్చేన్ చేస్తే సర్"అన్నాడు బోసు.

"ఎంప్లాయిమెంట్ నోటిఫికేషన్లు ఇస్తున్నామని చెప్తూనే ఉన్నామయ్యా, ఎలక్షన్ ముందు నోటిఫికేషన్ రిలీజ్ చేస్తే సరిపోతుంది. మన మీద కృతజ్ఞతలతో వాళ్ళు మన వైపు ఉంటారు. ఇదిగో కడుపులు కాలుతున్నవాడే మనం చెప్పేది వింటాడు. కడుపు నిండిన వాడు మన మాటలు వినడు. ఇది రాజకీయాలలో నీతి సూత్రం గుర్తెట్టుకో" అన్నాడు చతుర్ముఖం.


"ఈయనకు నాలుగు నాలుకలు అని అర్థం వచ్చే పేరేమన్నా తెలుగు లో ఉంటే అది కరెక్ట్ గా సరిపోతుంది అనుకుని "అన్నీ చివర్లో చేస్తే ఈ నాలుగేళ్లు మనం వెలగబెట్టేది ఏమిటి? బుగ్గ కార్లలో తిరుగుడు, బూతులు తిట్టుడు అంతేనా?" అని అడగా లనిపించింది.. కానీ ధైర్యం లేక మనసులోనే ఉంచుకున్నాడు బోసు...

-శ్రీనివాస శాస్త్రి, హైదరాబాద్.

## ఉగాది శోభ



ప్రకృతి నర్తిస్తుంటే విరిసిన పువ్వులు
నవ్వులు చిందిస్తున్నాయి
రంగు రంగుల ముగ్గులు
మామిడి తోరణాల అలంకారాలు
కోయిలల కూనిరాగాలు
ఈ ఉదయం కొత్త ఆశలతో
వెలుగులు నింపుతూ
ఉగాదికి ఆనంద స్వాగతం పలుకుతోంది.
గతాన్ని గుర్తుచేసే పాత పంచాంగం
తొంగి తొంగి చూస్తుంటే
భవిష్యత్తు మార్గం చూపే
కొత్త కాంతి గడియారం
లాభనష్టాలను బేరీజు వేస్తోంది.
పూర్వీకుల ఆశీర్వాదాలు
స్నేహం, ప్రేమ పరిమళాలు
పండుగ శోభను పెంచుకుంటూ
కొత్త సంకల్పాలకు నాంది పలుకుతూ,
శ్రీ పరాభవ నామ సంవత్సరాన్ని
స్వాగతిద్దాం!.





-చిత్రాడ కిషోర్ కుమార్
9866912906

## మువ్వన్నెల జెండా

ఆర్మీలో ఉన్న తన భర్త సంజయ్ రాసిన ఉత్తరాన్ని చదువుతున్నది తన్మయ.

ఆమె కనులు అక్షరాల వెంట పరుగులు పెడుతున్నాయి.

"తన్వీ, బహుశా ఇదే నా చివరి మాటలు కావచ్చు. అందుకే నా మాటల్ని ఫోనులో కన్నా ఇలా పేపర్ మీద అయితే నీవు పదిల పరుచు కుంటావని

లెటర్ రాశాను. రాబోయే స్వతంత్ర దినోత్సవ నేపథ్యంలో ఇక్కడ సరిహద్దులో శత్రు సైనికుల కవ్వింపు చర్యలు, అలజడులు ఎక్కవ అయి మాకు కునుకే లేదు. కానీ సైనికులు అందరం ఎంతో ధైర్యంగా ఉన్నాం. నువ్వు కూడా ధైర్యంగా ఉండు ఏం జరిగినా సరే...స్వాతంత్ర్య దినోత్సవం

జండా ఎగుర వేస్తారు అందరూ...

ఎఱ్ఱ కోటపై మన త్రివర్ణ పతాకం నిశ్చయంగా సగర్వంగా ఎగురుతుంది ఏ ఆటంకాలు లేకుండా...

మరో విషయం... నేను సజీవంగా తిరిగి వస్తే నా చేతిలో, లేదంటే నా దేహంపై ఎగురుతుంది ఆ మూడు రంగుల జెండా " చదువుతూ ఉంటే కన్నీళ్లు

అడ్డు రావటంతో చూపు మసక బారింది తన్మయకు. ఇలా ఆ లెటర్ చదవటం మొదటి సారి కాదు. వచ్చిన రోజు నుంచి ఇప్పటికి కొన్ని వందల సార్లు చదివింది.


కానీ ఇప్పుడు కూడా చదువుతున్నది తన్మయ...

ఎదురుగా ఉన్న సంజయ్ నిశ్చల దేహంపై గాలికి ఎగురుతున్న త్రివర్ణ పతాకం సాక్షిగా....

-పరుచూరి కృష్ణ భార్గవి,
గుంటూరు.

పుస్తక సమీక్ష

# జీవితానుభవాలను తెలియజేసే భావచిత్రాలు 'నానీ కపోతాలు"







ప్రతులకు:
చింతా రాంబాబు
99491 78092

చింతా రాంబాబు గారి "నానీ కపోతాలు" లేదా ఆయన రాసిన నానీలు మానవ జీవనంలోని వివిధ పార్శ్వాలను ప్రేమ, తల్లి, యువత, అంతర్గత పోరాటం, సామాజిక విలువలు, రైతు జీవితం మితమైన పదాలలో, ఘనమైన భావంలో ప్రతిబింబిస్తాయి. ముందుగా "నానీ" అంటే ఏమిటో చూద్దాం ..నానీల గురించి..

సుప్రసిద్ధ కవి డాక్టర్ ఎన్ గోపి గారి సృష్టి నానీలు ఇప్పటివరకు దాదాపుగా వేలమంది కవులు స్పందించి రచించారు. తక్కువ పదాలతో ఎక్కువ అర్థాన్ని అందించాలనేదే వీరి ఆశయం. ఈ నానీలు ఇప్పటికే దేశవ్యాప్తంగా విస్తరించబడ్డాయి. తెలుగు సాహిత్యంలో హైకూల తర్వాత స్థానాన్ని ఆక్రమించి అందరి దృష్టిని ఆకర్షించిన ఈ నానీలు ఈ రోజు మరో కవి "చింతా రాంబాబు" తమ నానీ కపోతాలు అనే శీర్షికతో రచించారు. ఇక వీటి వివరణలోకి వెళితే ..

"నానీ" అనేది తెలుగు చిన్న కవితా రూపం. ఇది హైకూ జపాన్ కవితా రూపం ప్రభావంలో పుట్టినా, తనదైన తెలుగు వాసన కలిగి ఉంటుంది. సాధారణంగా 4 పాదాలు (లైన్లు), 20 నుండి 25 అక్షరాల మధ్య, క్షుణ్ణమైన భాషలో ఒక ఆలోచన లేదా భావాన్ని మలచే కవిత. నానీ అంటే 'చిన్నది కానీ నాణ్యమైనది' అన్న భావం. చింతా రాంబాబు గారి "నానీ కపోతాలు" ఈ రూపానికి చక్కని ఉదాహరణలు. అవి మానవత, ఆత్మపరిశీలన, ప్రేమ, ప్రకృతి వంటి అంశాలను మృదువైన కవితా భాషలో చెబుతాయి.

"ఆమెకు/ఎదుటివారి ఆకలి తెలుసు/ఎంతైనా/అమ్మ కదా" ఈ నానీలో తల్లితనంలోని అమోఘమైన సానుభూతి ప్రతిబింబిస్తుంది. తల్లి తన ఆకలిని మర్చిపోయి ముందుగా పిల్లల ఆకలిని గుర్తిస్తుంది. "ఎంతైనా అమ్మ కదా" అనే చివరి పాదం సర్వసాధారణమైన వాక్యం అయినా దానిలో ఉన్న ప్రేమ, త్యాగం, మమకారం అపారమైనవి. ఒక వాక్యంలోనే తల్లితనం అంతా ఇమిడిపోయింది.

"యువత/వ్యసనాల వేటలో/కన్నవారు/దుఃఖాల ఊటలో" ఇక్కడ రచయిత సమాజంలోని యువత ప్రవర్తనను చురుకుగా చూపించారు. ఆధునిక వ్యసనాలు మత్తు పదార్థాలు, ఫోన్లు, ఫ్యాషన్, ఖాళీ ఆనందాల వేట వీటి వెనక పరిగెత్తే యువతను చూస్తూ తల్లిదండ్రులు బాధపడుతున్నారు. "కన్నవారు దుఃఖాల ఊటలో" అనే పాదం ఆ వేదనను గాఢంగా వ్యక్తం చేస్తుంది. మరొక చోట ఇలా అంటారు. "అంతర్గతంగా నిత్యం/యుద్ధం జరుగుతూనే ఉంది/నాతోనే/నాకు" ఇది మనసు లోపలి పోరాటాన్ని ప్రతిబింబించే లోతైన నానీ. మనిషి తన మనస్సులోనే ప్రతి రోజూ యుద్ధం చేస్తుంటాడు. మంచిదీ చెడ్డదీ, ఆశయమూ వాస్తవమూ, మనసూ మాయలూ ఇవన్నీ పరస్పరం పోరాడుతుంటాయి. చివరి పాదం "నాతోనే నాకు" ఆ అంతర్గత ఘర్షణను అద్భుతంగా సారాంశం చేస్తుంది.

"దంపతుల్లో/అవగాహనా లేమి/విడాకులా/అయ్యో ఇదేమి" ఇది కుటుంబ సంబంధాలపై వేదనను వ్యక్తం చేస్తుంది. అవగాహన, పరస్పర గౌరవం లేకపోవడం వల్ల దంపతుల మధ్య విభేదాలు పెరుగుతాయి. "విడాకులా అయ్యో ఇదేమి" అనే పాదం ఆ బాధను సాధారణ భాషలోనే గాఢంగా చెబుతుంది. చిన్న వాక్యాల్లోనూ సామాజిక వాస్తవం ఉట్టిపడుతోంది.

"మట్టి/పరిమళం వెదజల్లింది/అన్నదాత/చెమట స్పర్శ అది'' ఇది రైతు జీవిత సౌందర్యాన్ని గానిస్తూ ఉంటుంది. మట్టి పరిమళం వెనుక ఉన్నది రైతు చెమట. ఆ చెమటలో జీవన గీతం ఉంది. భూమి వాసన, రైతు కష్టం, అన్నదాత గౌరవం ఇవన్నీ నాలుగు పాదాల్లో కవిత్వమై మిళితమై ఉన్నాయి.

మొత్తం చూస్తే చింతా రాంబాబు నానీలు చిన్న పాదాల లోపల పెద్ద భావాలను నింపినవి. తల్లి ప్రేమ నుంచి రైతు చెమట వరకూ, మనసు పోరాటం నుంచి సమాజం బాధ వరకూ ఆయన పదాలు అర్థవంతమైన కవిత్వంగా ప్రతిధ్వనిస్తాయి.


మొత్తం గా చింతా రాంబాబు గారి నానీలు మనిషి జీవితంలోని అనేక రంగులను అద్భుతంగా ప్రతిబింబిస్తాయి. తల్లి మమకారం, యువత మార్గభ్రంశం, అంతర్మథనం, దాంపత్య సంబంధాల సున్నితత్వం, రైతు చెమట పరిమళం ఇవన్నీ ఆయన చిన్న పదాల లోపల పెద్ద భావాలుగా మెదులుతాయి. భాష సరళంగా ఉన్నప్పటికీ భావం లోతైనదిబీ ఆలోచన స్పష్టంగా ఉన్నప్పటికీ మనసును తాకే గాఢత కలిగి ఉంటుంది. ఈ నానీలు కేవలం చిన్న కవితలు కాదు, జీవితానుభవాలను ప్రతిబింబించే భావచిత్రాలు.



-శైలజామిత్ర
9290900879

## నీ స్నేహ సంతకం

సరళ రేఖ లా - సానుకూలతను చేకూర్చే - కలవృక్షం -
నీ స్నేహ సంతకం
సమభావనతో - సంచరించేలా చేసే - కర్షకం - నీ స్నేహ సంతకం
సరదాగానే వుంటూ - దగా చేయ నివ్వని - అవరోధకం -
నీ స్నేహ సంతకం
సడి వినగానే - చిరునవ్వుతో స్వాగతించే - ప్రముఖం - నీ స్నేహ సంతకం.
సహకారానికి - సన్నద్ధతతో మెలిగే - మౌక్తికం - నీ స్నేహ సంతకం
సమంజసమైన - పన్లనే చేయించే - పూనకం - నీ స్నేహ సంతకం
సరే సరే నంటూనే - సాగతీత పన్లు చేయనివ్వని - నాగరికం -
నీ స్నేహ సంతకం
సంస్కృతిని - జ్యోతిలా - అలరించేలా చేసే - గమకం -
నీ స్నేహ సంతకం.
సమయ పాలనను పాటించేలా చేసే - గంధకం నీ స్నేహ సంతకం
సమాజం మెచ్చుకునేలా చేసే - కారకం - నీ స్నేహ సంతకం
సభ్యతగానే వుంటూ - మభ్యపెట్టే పన్లు చేయ నివ్వని - కీలకం -
నీ స్నేహ సంతకం
సగటు జీవిని కూడా - ఇష్టతతో లాలించే - లోలకం నీ స్నేహ సంతకం.
సమాచారం-ఎఱిగి-ఎదిగేలా చేసే-ఏరువాకం-నీ స్నేహ సంతకం
సభ్యతతో-సమిష్టిగా అడుగిడేలా చేసే-ప్రయుక్తం-నీ స్నేహ సంతకం
సముఖమున-సుముఖంగానే వుంటూ-నష్టం చేకూర్చ నివ్వని-ప్రత్యేకం-
నీ స్నేహ సంతకం
సమస్యలను-స్పష్టతతో-అనుకూల పరచేలా చేలా-శ్రద్ధ-ధ్యాస-
శ్వాసలను నిలిపి - ప్రతి కదలికలోనూ
శ్రమిస్తూ-నిన్నలేని అందాన్ని అందుకునేలా-నారాయణీయ
గంగా ప్రవాహ-పారవశ్య-స్నేహ రేఖలను అందించే
ప్రమోద రూపకం-
నీ స్నేహ సంతకం.



-లంకా వెంకట సుబ్రహ్మణ్యం
9440448650.

## విజ్ఞాపన...

హీరో ననిపించు కోవాలనే ఉబలాటానికి
రయ్ మని దూసుకెళ్లే దూకుడుకి
వింతైన విన్యాసాల ఉత్కంఠ ప్రదర్శనకి
వద్దనుకున్నా వేదిక నౌతున్న మూగ వేదన నాది!
మత్తులో జోగుతూ బండి నడపడాన్ని
ఎత్తు పల్లాలు చూడక అదుపు తప్పడాన్ని
పదే క్షణాల్లో పకపకలు మూగబోవడాన్ని
కాదనుకున్నా ఎదుట కనబడుతుంటే..
కన్నీరు మున్నీరౌతున్న మౌన రోదన నాది!
పక్కనోడితో పోటీ పడుతూ.. వేగం పెంచడాన్ని
బైక్ పై కూర్చుని.. సెల్ లోకంలో విహరించడాన్ని
ఆపద స్పృహ లేకుండా.. నడి రోడ్డుపై రేసింగ్ చెయ్యడాన్ని
ఆపాలనుకున్నా. ఆపలేక కుమిలే ఆత్మ శోధన నాది!
జల్లులా కురిసే రక్తపుధారల్ని తాగలేక
చెల్లాచెదురైన అవయవాల్ని ఒడిలో దాచలేక
తల్లడిల్లే తల్లుల ఆర్తనాదాల్ని ఆలకించలేక
ఇల్లాళ్ళ వైధవ్యానికి సాక్ష్య మవలేక.. అల్లాడే ఆవేదన నాది!
జరిగే ఘోరాలకి నా కాంక్రీటు గుండెలే కరిగి నీరౌతున్నా
తిరిగిరాని లోకాలకి తనువులు తరలి పోతున్నా
లవలేశ మైనా చింతించక.. హెల్మెట్ సీట్ బెల్ట్ పెట్టని
యువత లో మార్పు కోసం.. చేసే నిత్య ప్రార్థన నాది!
నాలో రగిలే ఈ చింతల చితి నింకా మోయలేను
ఎల్ల కాలమిలా కరుగుతూ.. మరుగుతూ మనలేను
పెరిగే ప్రమాదాలతో రహదార్లు.. యమపురికి..
దగ్గరి దారులవడం ఓర్వలేను
ధోరణి మార్చుకోని జనాన్నింకా భరించలేననే నివేదన నాది!
లోభపు మంటల్లో బడి..
శలభం లా మాడిపోయే
వ్యామోహం నించి
చోదకుల్ని సంస్కరించి..
నాకొకింత నెమ్మది నిమ్మనే
విజ్ఞాపన నాది

(రోడ్డు భద్రతావారోత్సవాల సందర్భంగా ఒక రోడ్డు విజ్ఞాపన..)



- ఎస్. కాశింబి
9052216044



## కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది.
అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

సహజీవన సమజీవన
సద్భావన జనజీవనం సజీవ దహనమై
నిస్వార్థాన్ని నిలువునా చీల్చి
గ్రామ సింహమై
వీధి వీధుల్లో విహారం చేస్తుంది
రాక్షసత్వ శక్తి తన ఉనికిని చాటుకుంటుంది
పైశాచికానందం పొందుతుంది
అమాయకమైన ముఖం లోపల
క్రూరత్వం
నింపుకుని
అబలలపై పడి రక్కిరక్కి
పైశాచికానందం పొందుతుంది
నీతిలేని తత్వం మానవత్వం లేని మనసు
ధర్మాధర్మం తెలియని బతుకులు
ఏదో అజ్ఞాత శక్తికి చెందిన పావులు
అత్యాచారం హింస
అల్లర్లు దౌర్జన్యం వీరి నిత్యకృత్యాలు
వీటి ముసుగు లోనే
చిత్తకార్తె శునకాల్లా వీరవిహారం
ఏం సాధించాలనో. ఎవరికై సాధించాలనో
రంగరించి పోస్తున్నా మత్తు పానీయం
రాక్షసత్వ కర్మాగారంలో
తయారవుతున్న గ్రామ సింహాలు
రాక్షసత్వానికే విశ్వాసపరులు
మానవ సమాజానికి పట్టిన చీడ పురుగులు
స్వార్థ పరుల చేతుల్లో బలిపశువులు
వారి వేళ్ళపై ఆడే ఉన్మాదులు మరో తీవ్రవాదులు

– షేక్ సలాం
+91 99639 30993

## మురిపించే చిత్రం

అరుణోదయ కాంతులతో బాల బాలుడు
ఉదయించే ఉషోదయం మురిపించే చిత్ర ప్రేమికుడు.
శ్రమజీవులు తమ విధులలోకి ఉపక్రమిస్తూ
రాళ్ల బాటలో సద్ది మూటలతో నడుస్తూ.
నదీ ప్రవాహం ఇరువైపులా రహదారి మార్గం
హైలెసో అంటూ సాగుతున్న పడవ ప్రయాణం.
ఎటు చూసినా తాడిచెట్ల కట్టవులు గనాల గట్టుపై
పరవశించి ఆడుతున్న పక్షుల గుంపులు చెట్లపై.
స్వచ్ఛమైన వాతావరణం, కాలుష్య నీడలకు కడుదూరం
ముచ్చట గొలిపే రైతన్నల కుటీరాలు సుందరమయం.
నేలతల్లికి పచ్చ చీర కట్టేసిందు కర్షకుడు
మిసమిస లాడుతున్న పైరు చూసి మురిసి పోతాడు.
ఊహల మేడలో మునిగిపోతాడు పంట చేతికొచ్చేలోపు
ఎండనక వాననక పనిచేసే కూలన్న కాసంత మైమరపు.
అనునిత్యం దిన చర్య పొలం పనే తనకు తెలిసిన లోకం
పంట చేతికందితే పరమాన్నం.
మాయలు, మర్మాలు ఎరగని మనసున్న రైతన్న
గిట్టుబాటు ధర రాకుంటే, నిలువెల్లా కూలిపోతాడు పిచ్చన్న.
పస్తులతోనే, కుమిలిపోతూనే, మరలా పంట వేస్తాడు
ఉరితాడుకు సమీపంలో రైతే రాజు అంటూ నవ్వేస్తాడు.
తరాలుగా ఈ లోకానికి బువ్వ పెడుతూ ...
ఎందరేమనుకున్నా వ్యవసాయానికి అంకితమౌతూ...

–గుండు మల్లికార్జునరావు
+91 89780 26059

## సంతసాల తోరణం

సంస్కృతీ సంప్రదాయపువారధిగా నిలిచే హోలీ.
పంతాలతో విడిపోయిన జనహృదయాల
. స్నేహలతల
మొలకలునింపి ఫలాలు తూగును
శిశరాంతాన. సప్త వర్ణమయ
చిగురులు చూడ బహుముచ్చటే
వసంతాగమనపు శుభారంభమై
హరితసందడుల చలి వీడుతూ
అత్యంత వైభవంగా అనాదిగా సాగేటీ
పర్వదిన మై కలిగించు మనోల్లాసం
ఏడు రంగుల ఏకసూత్రపు ఒద్దికే శ్వేత వర్ణం
ప్రేమ మూర్తులు రాధాకృష్ణులు ఆటల
పాటల చిత్రవిచిత్ర రంగుల.మెరసి మురియు
ధనిక పేద వర్గబేధాలు మరచి ఆడేటి రంగుల పండుగ.
రాజ్య సుభిక్షత కోరి ధనిక పేద తారతమ్యత
లెరుగక హ్లాదముతో ఆడేటి వసంతకేళి.
అధిక కోరికలే మానవ పతనానికి కారణమౌ.
చిచ్చు కంటి దేవర సుమశరుని హరియించె.
కామ దహన మే సుఖంబుల నిచ్చు తంతకనుక
ప్రకృతి నుండి సంగ్రహించిన రంగులు
నీలిరంగు ప్రశాంత. ఆకాశం.లా ఆనంత తత్వాన్ని
మరియు స్వేచ్ఛ ను తెలుపు
హరితం.సస్య వనరు పర్యావరణ హితమగును.
పసుపు.స్వర్ణరంజకం ఉల్లాసం శుభ సంకేతం.
ఎరుపు ప్రేమయు ఉత్సాహం.శౌర్యస్థైర్య సూచిక
ఆరెంజ్.. త్యాగ ప్రతీక
ఊదా..రాజ్యసంపద.. ఆధ్యాత్మిక వనరు
శాంతి సామరస్యం వంగపండు రంగు..
సహజ వర్ణాలు చేకూర్చుకొనుటయే ముదితమే
ముద్దుముద్దుగా హోలీఆటల తేలు వేళలే
హృదయఫలకమునదాగును.సరదాగా డోలలూపి
హాయిగూర్చు

–యక్కంటి పద్మావతి
+91 98496 14898

## విశ్వమంత ప్రేమ

నీ నీడగా నన్ను నడయాడనీ, నీ జతలో నన్ను జీవించనీ, నీ అడుగులో అడుగునై నన్ను సాగనీ,
నీ ఊపిరికి గాలిగా మారి, నీ హృదయములో నన్ను నిదురించనీ, నీ బ్రతుకులో శతకోటి ప్రణయరాగాలు కురిపించనీ
నీ పాటలో పదమునై పలకనీ, నీ అధర దరహాసము నేనుగా అవనీ
నీ సూర్యోదయానికి నేను మందహాసదీప్తిగా, నీ సాయంత్రానికి నా మౌనం శాంతిగా
నీ కన్నీటికి నా తోడు ఓదార్పుగా, నీ ఆనందానికి నా ఆత్మయే నిరంతర గానముగా
నీ మౌనంలో నా మాటలు కలసి, నీ మాటల్లో నా మదిభావాలు పులకించనీ
నీ కన్నుల్లో నా కలలు నిండి రెండు హృదయాలు ఒకటైన జీవనం కానీ
నీ నడకలో నేనొక నీడలా, ఎప్పుడూ విడువని తోడుగా, నీ కష్టంలో నీ అశ్రుధారగా స్రవించనీ
నీ విజయానికి నేనొక నిచ్చెనలా, నీ దీపము కాంతిలా, నీ తీరానికి నేనొక నౌకలా మారనీ
నీ జీవన మార్గం అంతా నా ప్రేమ పూలను నింపనీ, నీ గమ్యమునకు, నా సాన్నిధ్యం నీ శ్వాసగా ఉండనీ
నీ చిరునవ్వులోని చిరుదీపంగా వెలగనీ, నీ అనురాగ రాగబంధమై నిలిచిపోనీ
నేల సాక్షిగా నింగి సాక్షిగా మల్లెల తెల్లదనం, వెన్నెల చల్లదనం నీకు అందివ్వనీ
ప్రాణం పోసిన బ్రహ్మ సాక్షిగా, జన్మనిచ్చిన అమ్మ సాక్షిగా నా ఊపిరున్నంతవరకూ నీతోనే ఉండనీ
కోటి పుష్పాల పూజచేస్తూ ప్రతి ఉదయం క్రొత్త రవికిరణం అందించనీ, విశ్వమంత ప్రేమను పరచనీ
నీ జీవితకథలో నేనే శాశ్వత పుస్తకంగా నిలువనీ,
నీ పేరు పక్కనే నా పేరు నిత్యస్మృతిగా చెక్కనీ
నీ నీడగా నన్ను నడయాడనీ నా నేస్తమా, నన్నే నన్నే కదలాడనీ, కలిసి కరిగిపోనీ....

–శాంతలక్ష్మి మునిమడుగు
+91 94404 23273

## మార్గదర్శి

అందం నశించింది
నల్లని వెంట్రుకలు తెల్లబడ్డాయి
బిగువైన అవయవాలు
సడలిపోయాయ
తలఇటూ అటూ
ఊగుతోంది
చూపు తగ్గిపోయింది
అరుచి కలిగింది
పండ్లు ఊడినవి
దగ్గూ ఆయాసం
దానికి తోడు తలభారం
మనసు చెదిరింది
మమతకరువైంది
ఎవ్వరికీ పట్టని
పలుకరింపులులేని
జీవిని అనే నిస్పృహ
నిరాశ,దిగులు నిన్నావహించింది
వద్దు నిరాశ కు లోను
కాకు
నిస్పృహ దరిచేరనీకు
గతించిన నీ జీవితంలో
నీకెంతటి ప్రత్యేకత ఉందో
ఇప్పుడు అంతే సందేశం ఉంది
నీ నెరిసిన వెంట్రుకలు
నిర్మలత్వానికి చిహ్నం కాదా
సడలిన బిగువైన
అవయవాలు మోహపాశంవల్లఏర్పడిన
బంధాలను వదులుకుంటున్న
సందేశం కాదా
అటు ఇటు ఊగుతున్న తల
ఇంద్రియాల వలన పొందే
కోర్కెలు ఇక వద్దంటున్న సంగతి కాదా
తగ్గిన కంటిచూపు
దగ్గు,ఆయాసం ,అరుచి,
ఊడిన పండ్లు
తమకం కలిగించే
యవ్వన దశ ఎవరికైనా
దాటిపోక తప్పదనే సంకేతం కాదా
నీ శరీరానికి వృద్ధాప్యం కానీ
నీ మనసు నిత్య నూతనం అని గమనించు
హృదయపు ముడి విప్పి
ఒకసారి నిన్ను నీవు గమనించు
నీవు అనుభవైక జ్ఞానానివి
ఎన్నో జీవిత గ్రంథాలు చదివిన
విజ్ఞానివి
సంసార సాగరాన్ని
ధైర్యంగా పడవ దాటించిన సరంగువి
జయాపజయాలు సంపదలు ఆపదలు
గాలికి అల్లల్లాడే దీపపుకొనలు మాత్రమే
వచ్చి పోయే కెరటాలు
మాత్రమే
నీకు తెలిసిన ఈ జీవన సత్యాన్ని
నీ వారికి
ఒక మౌన యోగి వై
చేతల ద్వారా అందించు
వ్యార్ధక్యం నీకో లెక్క కాదని
అందుకు తగిన మన స్థైర్యం
నీలో ఉందని
నిరూపించు
సంతోషంగా నిత్య మానసిక
యవ్వనునిగా
జీవించు
మార్గదర్శివై అందమైన
సంధ్యా కాలాన్ని ఆస్వాదించు

–యర్ర శ్రీదేవి
,+91 99591 94224

# నిజాం వ్యతిరేక పోరాట యోధుడు మందుముల



మందుముల నరసింగరావు (మార్చి 17, 1896 - మార్చి 12, 1976) నిజాం విమోచన పోరాట యోధుడు, రాజకీయ నాయకుడు, పత్రికా రచయిత, న్యాయవాది, ఆంధ్ర జనసంఘ స్థాపకులు, సంఘ సంస్కర్త, పాలమూరు జిల్లాకు చెందిన సమరయోధుడు మందుముల నరసింగరావు మార్చి 17, 1896 న ప్రస్తుత రంగారెడ్డి జిల్లా చేవెళ్ళలో జన్మించారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన నరసింగరావు న్యాయ శాస్త్రంలో పట్టభద్రులు అయినారు. పర్షియన్ భాషలో కూడా అయన గొప్ప పండితులు, పత్రికా రచయితగా పేరు పొందారు. 1921లో ఆంధ్ర జనసంఘాన్ని స్థాపించిన వారిలో ఒకడు. 1927లో న్యాయవాద వృత్తికి స్వస్తి చెప్పి పత్రికారచన, రాజకియాలు చేపట్టారు. 1927లో రయ్యత్ అనే ఉర్దూ వార్తాపత్రిక స్థాపించి సంపాదక బాధ్యతలు చేపట్టారు. మందుముల, సమర రంగంలో కూడా కీలకపాత్ర వహించి 1937లో ఇందూరు (నిజామాబాదు) లో జరిగిన 6వ ఆంధ్ర మహాసభకు అధ్యక్షత వహించారు. 1938-42 కాలంలో నిజాం లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారు. 1947లో జాయిన్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టు అయ్యారు. బాల్య వివాహాల రద్దుకు, వితంతు వివాహాలకు బాగా కృషి చేశారు. 1952లో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున హైదరాబాదు శాసనసభకు ఎన్నికయ్యారు. 1957-62 కాలంలో రాష్ట్ర మంత్రివర్గంలో పని చేశారు. నిజాం కాలంలోని దుష్పరిపాలనను వర్ణిస్తూ "50 సంవత్సరాల హైదరాబాదు" గ్రంథాన్ని స్వీయజీవిత చరిత్రగా రచించారు.

**మందుముల నరసింగరావు...**

టేకుమాల రంగారావు, మాడపాటి హనుమంత రావు, మిట్ట లక్ష్మీనరసయ్య, ఆదిరాజు వీరభద్రరావు, నడింపల్లి జానకి రామయ్య, బూర్గుల రామకృష్ణా రావు, బోయినపల్లి వెంకట రామారావు, కొమ్మవరపు సుబ్బారావు బూర్గుల నరసింహా రావు, డాక్టర్ వందింటి రామస్వామి నాయుడు తదితరులతో కలిసి 'ఆంధ్ర జనసంఘం'ను స్థాపించారు.

హైదరాబాద్ సంస్థాన ఆధునిక చరిత్రలో రావి నారాయణరెడ్డి, ముఖ్దూం మొహియుద్దీన్ వంటివారు అతివాద వర్గం ప్రతినిధులు కాగా, బూర్గుల రామ కృష్ణారావు, మందుముల నరసింగ రావు, మాడపాటి హనుమంత రావు, మాదిరాజు రామకోటీశ్వర రావుతదితరులు మితవాదులు.

భువనగిరిలో జరిగిన ఆంధ్ర మహా సభలకు వివిధ గ్రామాల నుండి ఎడ్ల బండ్లపై వచ్చిన వారు...రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి, మందుముల నరసింగరావు, బూర్గుల రామకృష్ణరావు లాంటి ప్రముఖులను ఎడ్ల బండ్ల మీద ఊరేగించారు. ఆయన బాల్య వివాహాల రద్దుకు, వితంతు వివాహాలకు బాగా కృషిచేశారు. 1952లో కల్వకుర్తి నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున హైదరాబాదు శాసనసభకు ఎన్నికయ్యాడు. 1957-62 కాలంలో రాష్ట్ర మంత్రివర్గంలో పనిచేశాడు. నిజాం కాలంలోని దుష్పరిపాలనను వర్ణిస్తూ "50 సంవత్సరాల హైదరాబాదు" గ్రంథాన్ని స్వీయజీవిత చరిత్రగా రచించాడు. యాభై ఏళ్ల హైదరాబాదు నగర సమగ్రచరిత్ర ఈ గ్రంథం. హైదరాబాదు రాజకీయ సామాజిక జీవనంలో ప్రధానపాత్ర పోషించి, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ప్రజాస్వామ్య ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన మందుముల నరసింగరావు కలం నుండి వెలువడిన రచన. ప్రత్యక్ష సాక్షిగా ఆయన కథనం.

మందుముల నరసింగరావు కూతురు అనంతలక్ష్మిని బూర్గుల రామకృష్ణారావు రెండో వివాహం చేసుకున్నారు. సమర యోధుడిగా పేరుపొందిన మందుముల రామచంద్రారావు ఆయన సోదరుడు. మార్చి 12, 1976 న మందుముల మరణించారు.

(మార్చి 12...మందుముల నరసింగరావు వర్ధంతి..)

–రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494



-కందుకూరి శ్రీరాములు
–బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

## నమ్మకం

నమ్మకం ఒక ఆస్తి కావాలి !
ఆస్తి అంటే డబ్బో దర్జానో కాదు
ఆస్తి అంటే ప్రేమప్రేమ స్వచ్ఛమైన నీరు
స్వేచ్ఛ ఉన్న గాలి కలుషితము కాని కారుణ్యం
బోలెడంత ఆస్తి కావాలన్న ఆశ
తనువులో అణువణువు ఆశిస్తుండాలి !.
నమ్మకం ఒక అధికారము కావాలి !
అధికారం అంటే లాఠీ తిప్పటం కాదు
అధికారం అంటే నిజాయితీ
నిజాయితీ నిర్మలమైన ఆకాశం
ఉరుములు మెరుపులు లేని వాత్సల్యం
నరనరాన జీర్ణించుకొని పోవాలి !.
నమ్మకమొక దైవం కావాలి !
దైవమంటే శూన్యంలో వస్తువులు సృష్టించటం కాదు
అరచేయి ఆత్మీయత తలమీద తీగై అల్లుకుపోవాలి
ఆకురసం ఆగి పోతున్న గుండెను ప్రాణమై నిబెట్టాలి
మనసు పొరల్లో సంతోషాలు పెళ్ళుబుకాలి !.
నమ్మకాలు వమ్ము కాకూడదు
నిర్ణయాలు నిర్మాణాలు
భుజం మీద బాణం
విల్లు మీద పడి ప్రయోగానికి సిద్ధమవ్వాలి !.
నమ్ముకున్న మట్టి ఇల్లును చేయాలి !
నమ్ముకున్న కలం కవితలు రూపొందించాలి !!.

–కందుకూరిశ్రీరాములు
9440119245

## వాకిలి చిత్రశాల

అమ్మ అమ్మమ్మ నానమ్మ అక్క చెల్లె
అందరూ వాకిట్లో రంగు రంగుల ముగ్గులు వేస్తూ
తరతరాల ముద్దుల ముగ్గుల కళను
గుర్తుకు తెస్తున్నారు సంబరంగా సంక్రాంతికి.
కుంచెలు లేవు !
ఆడపడుచుల వేళ్లే కుంచెలను మించినవి
పొడి పొడి రంగులు ధారగా వాకిలిని తాకగానే
ధరణి పై ముగ్గులై విరిసి మురిసి మెరిసినవి.
ఇప్పుడు వాకిలి చిత్రంగా ముగ్గుల చిత్రశాల
వన్ మాన్ షో కాదు
సామూహికంగా ఊరు వాడ ముగ్గుల ప్రదర్శనే
దార్శనికంగా మన సంక్రాంతి దర్శనం
అందరి వాకిట్లో రథం ముగ్గు
రథంలో ధాన్య లక్ష్మి
అంతరించని కళ ముగ్గుల కళ !
ప్రతి రోజూ వాకిలిలో ముగ్గుంటేనే
ఇంటింటికి కళ
ఇల్లాలు తెలివి

–కందాళై రాఘవాచార్య
8790593638

## అన్యాయం

బడా బాబుల గూటిలో గులాంగిరి చేస్తుంది న్యాయం.
పేదోడి ఆకలి డొక్కల మధ్య
పోలీసోడి జులుం ముద్దాడుతోంది.
దొంగ సాక్షాలతో న్యాయాధిపతులను ఖరీదైన కరెన్సీ నోటు కాటేస్తుంది. చిల్లర నాయాళ్ళు తమ జీవితాలను బందీఖానాలో జమ చేసుకుంటున్నారు.
నాయకులందరూ తారు రోడ్లను తమ స్విస్ బ్యాంకుల ఇం"ధనం"గా మార్చుకుంటున్నారు.
రౌడీలందరూ రాజ్యమేలడానికి
అసెంబ్లీలో మంతనాలాడుతున్నారు.
ఒక "ప్రత్యూష" బతుకు బుగ్గి పాలైనా.....
"దిశ"కేసుని బుల్లెట్ తో మూసేసినా.....ఏ యువకుని
మనసులో ఏమున్నదో చెప్పండి?
ఆడదాన్ని చూసి అంగలార్చుడే...!
మనసులో విషం నింపుకుని మనువాడతానంటాడు.
అవసరం తీరాక అందకుండా పోతాడు.
ఎక్కడుంది న్యాయం.

–శ్రీరంగం శ్రీశైలం, 9866139503

## రోజు పున్నమి వెన్నెలే !

రోజు ఏ రోజైనా చంద్రకలలు
పక్షం రోజులు పెరిగి తరిగే
నీడలే కదా !
పూర్తి నీడ నాడు అమావాస్య
ఏ నీడ లేని నాడు పుణ్ణమి కదా!
ఓ పూర్తి నీడ 24 గంటల అమావాస్య
ఓ పూర్తి వెలుగు 24 గంటల పుణ్ణమి
కొన్ని గంటల్లోనే తొలిగిపోయే
నీడ గ్రహణం కదా !
నీడ ఏ నీడైనా కొంతసేపే కదా!
భూత భవిష్యత్ వర్తమాన
జీవితంలోమంచి చెడులు
తొలిగి పోయే గ్రహణాలే!
ఓపికతో ముందుకు సాగితే
రోజు పున్నమి వెన్నెల కాదా!

–పట్లొళ్ళ బక్కారెడ్డి, 9705315250




## గంద్ర హన్మంత రావు స్మారక సాహితీ పురస్కారానికి :నవలల ఆహ్వానం


గత 20 యేళ్లుగా ప్రతి సంవత్సరం కవిత్వేతర ప్రక్రియలకు అందజేస్తున్న ప్రతిష్టాత్మక గంద్ర హన్మంత రావు సాహితి పురస్కారం ఈ సారి నవలా ప్రక్రియకు ఇవ్వడానికి నిర్ణయించాము. 2023, 2024, 2025 ల లో ప్రచురించ బడిన నవలలను 4 ప్రతులను డా॥ తత్వాది ప్రమోద్ కుమార్, ఇం. నెం. 8-2-కె ఏఏ0023, అయోధ్యా కాలనీ, రోడ్ నం-2, కట్టరాం పూర్ , కరీంనగర్ 505 001. చిరునామాకు **మార్చి 31**లో అంద జేయ వలసిందిగా తెలుగు రచ యితలకు (ఏ ప్రాంతం వారైనా, దేశం వారైనా సరే) తెలియజేస్తున్నాము. వివరాలకు 9441024607 నంబరుకు సంప్రదించగలరు.

–డా॥ తత్వాది ప్రమోద్ కుమార్, అధ్యక్షులు
సమతా సాహితి, కరీంనగర్
9441024607

# ముగ్గురికి సంగీతం, సాహిత్య పురస్కారాలు..



డా॥ కోదూరు ప్రభాకర రెడ్డి



ప్రముఖ వక్త సాహితీవేత్త సుధామ



డి.వి.మోహనకృష్ణ

హైదరాబాద్, మార్చి 11: సంగీతం సాహిత్యాలలో విశేష సేవలందిస్తున్న లబ్ద ప్రతిష్టులకు ప్రదానం చేసే పురస్కారాలను శాంతా వసంతా ట్రస్టు శనివారం ప్రకటించింది.

పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ. వరప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో శాంతా వసంతా ట్రస్టు విశిష్ట సేవలు అందించిన ముగ్గురికి పురస్కారాలను అందజేయనున్నట్లు ప్రకటించారు.

ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కోదూరు ప్రభాకరరెడ్డికి 'డా॥ వరప్రసాదరెడ్డి ఉత్తమ సాహితీవేత్త పురస్కారం', ప్రముఖ వక్త, సాహితీవేత్త సుధామకు 'కోదూరు వెంకటరమణారెడ్డి సాహితీ సేవా రత్న పురస్కారం', ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు డి.వి.మోహన కృష్ణకు వసంతా వరప్రసాదరెడ్డి సంగీతరత్న పురస్కారం ప్రదానం చేయనున్నట్లు ట్రస్టు ఒక ప్రకటనలో తెలిపింది.

అబిడ్స్ బొగ్గులకుంట తిలక్‌రోడ్డులో గల తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో **ఈనెల 15న ఉదయం 10 గం॥లకు** సాహితీవేత్తలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

పురస్కారం కింద ఒక్కొక్కరికీ లక్ష రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం, శాలువాతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్:రమాదేవి కులకర్ణి
8985613123



నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ

### ఇంద్రధనుస్సు

రంగేళి హోలీ అంటేనే రంగులమయం
సమాజమంతా కష్టసుఖాలను మరచి
సంబరంతో జరుపుకునే ఆనందాల కేళిక"
వయస్సుతో నిమిత్తము లేని కేరింతల కోలాహలమే హోలీ"
ఇంద్రధనస్సు తలపించే సంతోషాల లోగిళ్ళు"
అంబరాన్ని అంటే సంబరం "
అభిమానాలతో ఆప్యాయతలతో రోజంతా జరుపుకునే కోలాహలాల
పులకరింతల పరవళ్ళు"
చెడుపై మంచి సాధించిన దానికి సూచిక రంగేళి "
కలకాలం నిలబడదు అసత్యం ""సత్యం ఎల్లప్పుడూ ధర్మ మార్గ
పయనం "
పచ్చని చెట్ల యొక్క రంగురంగుల పూలతో తయారుచేసి అద్భుత
వేడుకగా జరుపుకునే అరుదైన అద్భుత వేడుక"
కల్మషం లేని కులమతాలకతీతంగా జరుపుకునే అద్భుత సందోహాల
సందడి "
ప్రకృతి అంతా పులకరించి ఫలవరించే సమయం "
భూమాత యొక్క అందమైన అరుగుపైన మానవాళి జరిపే అరుదైన
రంగుల హేళ"
ప్రకృతి పరవశించి పులకరించి మైమరిచే అద్భుత సమయం
హోలీ..

– ఉమారాణి ఇప్పు,సిద్దిపేట

### రంగుల రంగోళి

అహాన్ని అంతంచేసి
ఆశకు
ఊపిరిపోసే కామదాహనం
రంగులతో హంగులు లేకుండా
ఐక్యతను చాటే హోళి
ఆనందంతో
అవుతుంది రంగేళి.
పాపంపై
పుణ్యం విజయంసాధించి
వెలుగులతో
అశాంతి చీకటిని తరిమి
కేరింతల కోలాహలంతో
వీధులన్ని విందులుచేసే హోళి
సంబరాలకు సంకేతాలను
ఇస్తుంది రంగేళి.
కులాలు,మతాలంటు
విడదీసే వింత కేటుగాళ్ళ
మాటల్లో తడిసి
రంగుల
ప్రపంచాన్ని ఊహించుకొని
రేపటి వెలుగును ఆశతో చూసే
అందాల అనుబంధమే
రంగుల చినుకలే
హోలీ రంగేళి.
అంతరాలను ఆమడదూరంలో
ఉంచి
ఆత్మీయతను చాటే హోలీ
రంగులు కలిసినట్లే కలసి
శాంతిని పెంచే కేరింతల
హోలీ రంగేళీ.

–డా.బి.సుధాకర్

### రంగుల రంగేళి - వసంత కేళి

వసంతఋతువు ఆగమనంతో వచ్చు తొలి వేడుక హోలీ..
ప్రపంచంలో రంగులన్నీ కలిసి చేసే కోలాహలం ఈ హోలీ..
రాధా కృష్ణులతో మొదలయ్యిన రమణీయ రసమయ క్రీడ హోలీ
హోళిక అనే రాక్షసిని సంహరించిన దినం హోలీ!
చలికి ,పొగమంచుకి వీడుకోలు పలికి ,
వెచ్చదనాన్ని స్వాగతించే హోలీ..
చిన్నా, పెద్ద తారతమ్యాలు మరచి చేసే సరదా సందడి హోలీ..
తీపి,చేదును కలిపి పంచి పెట్టే విందుల పందిరి హోలీ..
ఆనందమే ఆకాశమై ,అత్యుత్సాహంతో చేసే అల్లరే ఈ హోలీ..
స్నేహితులకు ,ప్రేమికులకు మరో వసంతం ఈ హోలీ!
చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు ఈ హోలీ..
రాగద్వేషాలకు అతీతంగా అందర్నీ ఒకే చోట చేర్చే
సుహృద్భావ సంగమం ఈ హోలీ..
తరతరాల సంప్రదాయాల నిజ నిదర్శనం ఈ హోలీ!
హోలీ అంటే రంగులతో చేసుకునే సంబరం ..
ఆట ,పాటలతో అలరిస్తూ జరుపుకునే పర్వదినం..
ఎరుపు -కోపానికి ,ఆకుపచ్చ-అసూయకు,
పసుపు-ఆనందానికి ,గులాబీ -ప్రేమకు
నీలం-విశ్రాంతికి కాషాయం-త్యాగానికి అంటూ...
ప్రతీ మనిషి ఓ ఇంద్రధనుస్సు లా మారే పండుగ హోలీ..
అందుకే ఇది రంగేళి హోలీ, యమ హంగామా కేళి...
సకల జనుల హృదయాలలో స్పందించే ఆనంద రవళి!

–పిళ్ళా వెంకట రమణమూర్తి

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com